**నమ్మలేని నిజాలు**

పండుగ అర్థం
జీవన పరమార్థం
ఐక్యతా రాగం

కాళోజి మాట
చెదుకు వజ్రాయుధం
మంచికి అండ

వరద రొంపి
ప్రకృతి ప్రతీకారం
నిరోధ బాధ

దిగుడు బావి
రాతి మెట్లరాజసం
మధుర జలం

కాంస్య పతకం
ఆపు వెండి పతకం
పైడికి దారి



– రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

**శ్రీనిజాలు**

దేశాన విమానాలకు
బాంబు బెదిరింపులు !
ఉత్తుత్తివేనని తెలిసి
ఛి ఛి చీదరింపులు !
ఉత్తుత్తివి కాదండోయ్
దీపావళి బాంబులు !
వెంట వెంట పేల్చుతుంటె
పడతారు బెంబేలు !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 31-10-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 | సంచిక:71 | పేజిలు:6 | వెల: రూ.1/-

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మడావి ఆనంద్ రావు




జైనూర్, అక్టోబర్ 30: కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని రాసిమెట్ట గ్రామానికి చెందిన ఆదివాసి గుండు చిత్ర కళాకారుడు రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా మంగళవారం రాత్రి ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. భారత రాజధానిలో రాష్ట్రపతి భవన్ లో 13రోజుల గోండు పెయింటింగ్ వర్క్ షాప్ లో మడావి ఆనందరావు పాల్గొని తనదైన శైలిలో ఆదివాసుల ఆరాధ్య దైవం ఆత్మసూర్ పేన్ సంస్కృతి సంప్రదాయాలతో కూడుకున్నటువంటి గుసాడితాదొ డప్పు తుడుం కొడుతున్న గోండు పెయింటింగ్ వేసుకుని దీపావళి పండుగ ఇతిహాసాన్ని వివరించి ప్రదర్శన చేశారు.

ఆయన వేసిన చిత్ర ప్రదర్శన ఆల్బమ్ ని చూసి భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ అభినందించారు. మడావి అనంద్ రావు తెలంగాణ రాష్ట్ర ఆదివాసి గోండు చిత్ర కళాకారుడికి మడావి రాజేశ్వర్ అంతర్జాతీయ గోండు చిత్రకళాకారుడు. గోండు ఆర్ట్ డైరెక్టర్, డిజైనర్. ట్రైనింగ్ మాస్టర్ ఆదివాసీ పెద్దలు అభిమన్యు గ్రూప్ సభ్యులు, ఆదివాసి సంఘాల నాయకులు ఆనంద్ రావు అభినందించారు.

ఆదివాసికి చెందిన గోల్డ్ చిత్ర కళాకారుడు ఆనందరావు చిత్రకళా రూపంలో రాణించడం ఎంతో సంతోషకరమన్నారు. మడావి ఆనందరావు చిన్న వయసులోనే చిత్రకళలో ఎదుగుతూ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం ఎంతో గర్వకారణమని ఆదివాసింగాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జీడిమెట్లలో విషాదం.. ప్రేమ నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబర్ 30:అమ్మాయి ప్రేమ నిరాకరించిందని ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన ఎం.రాజశేఖర్ (31) జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేటు కంపెనీలో హెచ్ఆర్‌గా పని చేస్తున్నాడు.

ఇతడు ఓ అమ్మాయిని ప్రేమిం చమంటూ వెంటపడుతూ ఉండడంతో ఆమె అందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవఖానాకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కుల గణన కోసం అఖిలపక్షం- సహకరించాలన్న మంత్రి పొన్నం

**–బీసీ డిక్లరేషన్‌లో భాగంగానే సర్వే**
**–రాహుల్ ఆదేశాల మేరకు దేశ వ్యప్తంగా ప్రక్రియ**
**–నవంబర్ 6 నుంచి తెలంగాణలో ప్రారంభం**
**–పార్టీ శ్రేణులు స్థానికంగా ఉండాలి, సహకరించాలి..**
**–సమగ్ర సర్వేపై స్పష్టతనిచ్చిన మంత్రి పొన్నం**

హైదరాబాద్, అక్టోబర్ 30:కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన ప్రక్రియ నవంబర్ 6వ తేదీన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా సహకరించాలన్నారు.

దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో అధికారులకు సహకరించాలని సూచించారు.

150 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు.

**హుస్నాబాద్ ఆస్పత్రి అప్ గ్రేడ్**

హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో వంద పడకల నుంచి 250 పడకల స్థాయికి పెంచారు. అప్‌గ్రేడ్‌తో మార్పులు చేయడానికి ప్రభుత్వం రూ. 82 కోట్లు మంజూరు చేసింది. అప్‌గ్రైడ్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకి మంత్రి పొన్నం కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్య విద్య కోసం ముఖ్యమంత్రి సాయం

**–గిరిజన బాలికకు అండగా ముఖ్యమంత్రి**
**–పేదరికంతోనే ఎంబీబీఎస్ సాధించిన సాయి శ్రద్ధ**
**–ఫీజు కూడా చెల్లించలేని ఆర్థిక దుస్థితిలో కుటుంబం**
**–నెటిజన్ ద్వారా తెలుసుకున్న రేవంత్**

హైదరాబాద్, అక్టోబర్ 30:కుమురంభీం జిల్లాకు చెందిన గిరిజన బాలిక సాయిశ్రద్ధకు వైద్య విద్య కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు.



కుమురంభీం జిల్లా జైనూరు మండలం జెండాగూడ గ్రామానికి చెందిన గిరిజన బాలిక సాయిశ్రద్ధ ఎంబీబీఎస్ లో సీటు సాధించినా కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటోంది. ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకొని నీట్‌లో సీటు సంపాదించి ఆర్థిక స్థోమత సరిగా లేని కారణంగా చదువు మధ్యలోనే ఆపేయాల్సి వస్తోందని బాలిక తల్లిదండ్రులు వాపోయారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి తమ బిడ్డ డాక్టర్ అయ్యేందుకు సహకరించాలని కోరారు.

ఈ మేరకు ఓ నెటిజన్ ట్విట్టర్‌లో పోస్ట్ చేయగా.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. డాక్టర్ కావాలనుకుంటున్న ఆ బాలికకు భరోసా ఇస్తున్న అంటూ స్పెషల్ పోస్ట్ చేశారు. తన దృష్టికి వచ్చిన వెంటనే డాక్టర్ కావాలన్న ఆ అమ్మాయి కల నెరవేర్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చి రేవంత్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. వైద్య విద్యకు అవసరమైన ఫీజుతో పాటు ఇతర ఖర్చుల కోసం చెక్ ను అందజేశారు రేవంత్. ఈ సందర్భంగా సీఎంకు సాయిశ్రద్ధ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉల్లి రైతులకు న్యాయమైన ధర ఇవ్వాలని ధర్నా

**–వ్యాపారస్తుల సిండికేట్ అరికట్టాలని వినతి**
**–ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో**
**–సుందరయ్య సర్కిల్లో రాస్తారోకో.. స్తంభించిన ట్రాఫిక్**

కర్నూలు , అక్టోబర్ 30: ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యాపారస్తుల సిండికేట్ అరికట్టాలని, మార్కెట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు




చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సుందరయ్య సర్కిల్లో ఉల్లి రైతులు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో సుమారు గంటన్నర సేపు అటూ ఇటూ పోయే వాహనాలను ఆపి రోడ్డును దిగ్బంధనం చేశారు. ఉల్లి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని వ్యాపారస్తుల సిండికేట్ ను అరికట్టాలని, ఉల్లి రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలని, జాయింట్ కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని, ఏపీ రైతు సంఘం వర్ధిల్లాలని రైతుల ఐక్యత వర్ధిల్లాలని, గిట్టుబాటు ధర ఇచ్చేవరకు పోరాడుతామని పెద్ద ఎత్తున నినదించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎం రాజశేఖర్, టి రాముడు, గురు శేఖర్, అబ్దుల్లా, రంగప్ప, వి వెంకటేశ్వర్లు, హుస్సేన్ భాష, సుధాకర్, జి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగినది. ఈ సందర్భంగా జి రామకృష్ణ మాట్లాడుతూ? పది రోజులుగా ఉల్లి మార్కెట్లో ధరలు పూర్తిస్థాయిలో పడిపోయినాయని, రెండు లాట్లు మాత్రం హైయెస్ట్ చూపించి మిగతా 80% ఉల్లి ఉత్పత్తులను అత్యంత ధర తక్కువతో కొనుగోలు చేస్తున్నారని, దీనికి కారణం మార్కెట్ యార్డ్ లో వ్యాపారస్తులు అందరూ సిండికేట్ కావడమే కారణమని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

మార్కెట్ యార్డ్ లో పరిస్థితి మారకపోతే ఉల్లి పండించే రైతులు ఉల్లికి దూరమయ్యేటువంటి అవకాశం ఏర్పడుతుందని, ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్, కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాగే కొనసాగితే రైతులందరూ ఏకమై తగిన గుణపాఠం చెప్పే పరిస్థితి వస్తుందని, గత ప్రభుత్వాలకు పట్టిన గతే వీరికి పడుతుందని హెచ్చరించారు. వారం రోజుల లోపల సమస్య పరిష్కారం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి సింగవరం సురేష్, మిన్నళ్ల ఉల్చాల సావాది మద్దిలేటి కృష్ణ, మార్కాపురం ఆంజనేయులు, రైతులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్పెయిన్‌లో మెరుపు వరదలు.. అనేక మంది మృతి.. కొట్టుకుపోయిన కార్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: స్పెయిన్ లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. తూర్పు, దక్షిణ స్పెయిన్‌లో భారీ వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 12 అంగుళాల వర్షం కురిసింది. దీంతో అనేక ప్రాంతాలను మెరుపు వరదలు చుట్టుముట్టాయి. ఈ వరదలకు చాలా ప్రాంతాలు నదులను తలపించాయి. రహదారుల వెంబడి నీళ్లు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గల్లంతయ్యారు. వేలాదిగా కార్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి

అప్రమత్తమైన స్పానిష్ ప్రభుత్వం ఓ సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సమావేశమై దేశంలోని పరిస్థితిపై సమీక్షించింది. మరోవైపు ఈ వరదల్లో చాలా మంది ప్రజలు తప్పిపోయినట్లు స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో సాంచెజ్ తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మరోవైపు తప్పిపోయిన వారి కోసం అధికారులు అన్వేషణ ప్రారంభించారు. డ్రోన్ల సాయంతో వారిని గుర్తించే పనిలో పడ్డారు.

## 25 రోజుల పసిబిడ్డను.. 30 వేలకు అమ్మిన తండ్రి

గౌహతి, అక్టోబర్ 30: పేదరికంతో బాధపడుతున్న ఒక వ్యక్తి 25 రోజుల పసిబిడ్డను రూ.30,000కు అమ్మాడు. ఈ విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) వెంటనే స్పందించింది. ఒక డాక్టర్ ఇంటి నుంచి ఆ శిశువును అధికారులు రక్షించారు. అస్సాంలోని ధేమాజీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 4న దిబ్రూగఢ్‌లోని అస్సాం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ఒక మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పేదరికం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తల్లిదండ్రులైన ధిమాన్ బోరా, సబితా బోరా ఆడ పిల్లను భారంగా భావించారు. శిశువును ఆ హాస్పిటల్‌లో వదిలి అక్కడి నుంచి పారిపోయారు.

కాగా, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఈ సమాచారం తెలిసింది. దీంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) దీనిపై స్పందించింది. శిశువు పేరెంట్స్‌ను గుర్తించి తమ వద్దకు రావాలని ఆదేశించింది. భయపడిన తల్లిదండ్రులు మెడికల్ కాలేజీ హాస్పిటల్ నుంచి ఆ శిశువును తిరిగి పొందారు. అయితే పెగు సోహోరియా, ఆమె భర్తకు ఆ పసికందును రూ.30,000కు అమ్మేశారు.

మరోవైపు చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఈ విషయం తెలిసింది. దీంతో సిలాపత్తర్‌లోని డాక్టర్ చంద్రజిత్ డోలే ఇంట్లో ఉన్న ఆ శిశువును రక్షించి స్వాధీనం చేసుకున్నారు. శిశువు విక్రయంలో బుబుల్ బోరా, దిలీప్ సైకియా కీలక పాత్ర ఉందని అధికారులు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సొంతూరికి పయనం.. రైళ్లు,బస్సులు కిటకిట

**–దీపావళి సందర్భంగా సొంత ఊళ్లకు వెళుతున్న ప్రజలు**
**–వరుస సెలవులతో కుటుంబాలతో సహా ప్రయాణం**
**–మూడు నెలల ముందే రైల్వే టికెట్ల బుకింగ్**
**–ఆర్టీసీ, ప్రైవేటు బస్సులకు పెరిగిన రద్దీ**
**–దీపావళి సందర్భంగా ఆంధ్రకు వెళుతున్న ప్రజలు**
**–జనరల్ బోగిలో ప్రయాణానికి క్యూలైన్లు**
**–తోపులాట లేకుండా చర్యలు చేపట్టిన సికింద్రాబాద్ రైల్వే అధికారులు**

హైదరాబాద్, అక్టోబర్ 30:దీపావళి, నాగుల చవితి పండగలను గ్రామీణ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తు ఉంటారు. ఈ సారి దీపావళితోపాటు మూడు రోజులు సెలవులు కావడంతో హైదరాబాద్ మహా నగరంలో ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలు తమ సొంత ఊళ్లకు ప్రయాణమవుతున్నారు. శుక్రవారం, సోమవారం సెలవు పెట్టగలిగితే దీపావళితోపాటు నాగుల చవితి పండగ చూసుకుని తిరుగు ప్రయాణం కావొచ్చని ఈ ఏడాది అధిక సంఖ్యలో సొంత గ్రామాలకు బయలుదేరుతున్నారు. అలాగే దసరాకు సొంత ఊళ్లకు వెళ్లని వారు ఇప్పుడు వెళుతున్నారు. దీంతో రైళ్లు, బస్సులు రద్దీగా మారాయి.

హైదరాబాద్ నుంచి పాట్నా, కోల్‌కతా, వారణాసి, దానాపూర్, ఢిల్లీ, రాయపూర్, బిలాస్‌పూర్, టాటానగర్, ఖర్గపూర్, భువనేశ్వర్‌తోపాటు ఉత్తరాంధ్ర అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస తదితర ప్రాంతాలకు వెళ్లవలసిన ప్రయాణికులు మూడు నెలల ముందే టికెట్లు రిజర్వేషన్ చేయించుకున్నారు. ప్రధానంగా దానాపూర్ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, కోణార్క్, విశాఖ, గౌహతి, ఈస్ట్ కోస్టు, గోదావరి, గరీభ్, దురంతో తదితర రైళ్లలో నెల రోజుల క్రితమే రిజర్వేషన్‌లు భర్తీ అయ్యాయి. వెయిటింగ్ లిస్ట్ సైతం వందల్లోకి చేరింది. కొన్ని రైళ్లలో బుకింగ్‌కు కూడా అవకాశం లేకుండా నో రూమ్ దర్శనమిస్తోంది. దీంతో ప్రయాణికులు అనివార్యంగా జనరల్ బోగీలపై ఆధారపడాల్సి వస్తోంది.

రైళ్ల రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో తోపులాట ఉండకుండా నివారణ చర్యలు చేపట్టారు. జనరల్ బోగీ టికెట్ తీసుకున్న ప్రయాణికులకు క్యూలైన్ ద్వారా రైలు ఎక్కేలా అధికారులు చర్యలుతీసుకున్నారు. ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్ స్టేషన్‌లో ఈ ఏడాది ప్రారంభించారు. ఇది విజయవంతం అయితే ఇదే పద్ధతిని అవలంభిస్తారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన అన్ని రైళ్లకు క్యూ లైన్ ఏర్పాటు చేశారు.

సికింద్రాబాద్‌తోపాటు నాంపల్లి (హైదరాబాద్) , కాచిగూడ, లింగపల్లి రైల్వే స్టేషన్‌లు ప్రయాణికుల రద్దీతో నెలకొంది. మహా నగరంలో ఉంటున్న వివిధ ప్రయాణికులు తాము రిజర్వేషన్ చేయించుకున్న రైళ్లు



ఎక్కడానికి ఆయా స్టేషన్లు చేరుకుంటున్నారు. దీంతో అన్ని స్టేషన్లు రద్దీగా మారాయి.

జనరల్ బోగీల కొరత కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా వరకు 18 బోగీలు ఉన్న రైళ్లలో కేవలం 2 మాత్రమే జనరల్ బోగీలు , కొన్నింటిలో మాత్రం 3 నుంచి 4 సాధారణ బోగీలు ఉన్నాయి. అయినప్పటికీ అందుకు ఐదు రెట్ల మంది ప్రయాణికులు సొంత ఊళ్లకు వెళ్లేందుకు తరలి వస్తున్నారు. భార్యాపిల్లలతో సహా సికింద్రాబాద్ స్టేషన్‌కు తరలి వచ్చిన ప్రయాణికులు చివరకు జనరల్ బోగీల్లో కూడా వెళ్లేందుకు అవకాశం లేక స్టేషన్ బయటపడిగాపులు కాస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజు సుమారు 1.85 లక్షల మంది రాకపోకలు సాగిస్తుండగా.. పండగా సీజన్‌లో 30 వేల మందికి పైగా సొంత ఊళ్లకు బయలుదేరినట్లు అంచనా. మహాత్మ గాంధీ బస్టేషన్ రద్దీగా ఉంది. ఇక్కడ నుంచి తెలంగాణ, ఏపీలకు ఇటు టీజీ ఆర్టీసీ, ఏపీ ఆర్టీసీ బస్సులను నడుపుతున్నాయి. కొందరు ముందస్తుగా టికెట్ తీసుకోగా మరి కొందరు అప్పటికప్పుడు టికెట్లు తీసుకుంటున్నారు. ఇసుకపోస్తే రాలనంతగా బస్టేషన్ లో ప్రయాణికులు ఉన్నారు.

**ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు**

ప్రైవేటు బస్సులను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు.

దీంతో బీహెచ్ ఈఎల్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, గచ్చిబౌలి, ఎన్.ఆర్. నగర్, అమీర్‌పేట, లకడీకపూల్, నాంపల్లి, సీబీఎస్, మహాత్మాగాంధీ బస్టేషన్, దిల్‌షుక్‌నగర్, ఎల్.బి.నగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ప్రైవేటు బస్సుల కోసం వచ్చే ప్రయాణికులతో ఆయా ప్రాంతాలు రద్దీగా ఉన్నాయి.

## శ్రీవారి సేవలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి..

తిరుపతి, అక్టోబర్ 30:తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి భార్య, కుమార్తె ఇతర కుటుంబ సభ్యులు. 2024, అక్టోబర్ 30వ తేదీ ఉదయం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సతీమణితోపాటు కుమార్తె, అల్లుడు, మనవడు, ఇతర బంధువులు స్వామి వారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

ఈ సందర్భంగా స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం సుప్రభాతం అనంతరం.. వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు టీటీడీ అధికారులు దగ్గరుండి ఏర్పాట్లు చేశారు.

**చురక**

ప్రజాపాలనో ప్రజాపీడనో
ప్రజలే నిర్ణయించేది
అసంతృప్తులైతే వాళ్లే
అధికారం తలమార్చేది
ఆత్మస్తుతి నిందలు
అవసరం ఎవరికవి
సమస్యలు ప్రక్కదారి
సాగనంపే చర్యలివి



–వేల్పుల నారాయణ
9440433475

**నేటి కందం– నేటికి అందం**

దీపావళి శుభ దినమున
పాపావళి రూపుమాపి పరమాత్ముడు–స
త్యాపతి పలు శుభముల నిడి
కాపాడును గాత మిమ్ము కరుణామయుడై !!
(31–10–24 దీపావళి)



–రాధశ్రీ
సెల్:9494481210

## ఆక్రమణదారులను ఖాళీ చేయించండి - అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం..



హైదరాబాద్, అక్టోబర్ 30:రంగారెడ్డి జిల్లా ఎల్. బి. నగర్ నియోజకవర్గం పరిధిలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్నవారిని తక్షణం ఖాళీ చేయించి అర్హులైన వారికి అందించాలని రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

బుధవారం సచివాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, నందనవనంలో ఉన్న ఇండ్ల సమస్య, కేటాయింపుపై అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ డి. దివ్య, ప్రస్తుత రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన డాక్టర్ ఎస్. హరీష్, కె. శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ ఇండ్లను ఆక్రమించుకున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి రాజకీయ వత్తిడులకు తలొంగ వద్దని అధికారులకు సూచించారు. నందన వనంలో జె ఎన్ యూ ఆర్ ఎం పథకం కింద ప్రభుత్వం నిర్మించిన ఇండ్ల కోసం 2019లో దరఖాస్తు చేసుకొని, లబ్దిదారుని వాటా చెల్లించిన వారి ఇండ్లను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకోవడం పట్ల మంత్రిగారు తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం చేయాలని , అక్రమంగా ఆక్రమించుకున్న వారినుంచి ఇండ్లు స్వాధీనం చేసుకొని వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు అధికారులను ఆదేశించారు.

అలాగే మంకాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో ఉన్న న్యాయపరమైన సమస్యలను తక్షణం పరిష్కరించి, అర్హులైన వారికి కేటాయించాలని అధికారులకు సూచించారు.

ఈ రెండు అంశాలపై పూర్తిస్థాయి నివేదికను తనకు అందించాలని, వీలైనంత త్వరితగతిన ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు అన్యాయం జరిగితే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. ప్రజావాణిలో గృహనిర్మాణానికి సంబంధించి వచ్చే ఫిర్యాదులను సచివాలయంలోని తన కార్యాలయానికి పంపించాలని నోడల్ అధికారికి దివ్యకు సూచించారు. వాటి పరిష్కారానికి తన కార్యాలయంలో ఒక ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగించడం జరుగుతుందన్నారు.

## రుణమాఫీపై హరీశ్‌రావుకు మాట్లాడే అర్హత లేదు

**–మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 30:రుణమాఫీ గురించి మాట్లాడే కనీస అర్హత బీఆర్ ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు లేదని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

బుధవారం గాంధీ భవన్‌లో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విపక్షాలు కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా ఉన్నారని అన్నారు.

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 31-10-2024

### ఘంటారావం

మోహమాటానికి నవ్వుతున్నారంటే
మనసు హుసారుగా లేనట్లే
మాట మాటకు నవ్వుతున్నారంటే
మనకు ఎసరు పెడుతున్నట్లే..

అంతనంగ అనురత్నాన్ని
అంతమొందించు
"సత్య" చైతన్యజ్యోతిలా
శోభించు

ఒక్కరు లేకున్నా
ఒకే
చరవాణి లేకుంటే
చిరాకే.

వెలుగుతున్నానని
మురిసిపోకు
వెలిగించడం
మరచిపోకు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# ఘనంగా కవిసంధ్య స్వర్ణోత్సవం

**-కవిసంధ్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ...**

**వాడ్రేవు చినవీరభద్రుడుకు శిఖామని సాహితీ పురస్కారం**
**పాయల మురళీకృష్ణకు శిఖామణి యువ పురస్కారం**
**12 మందికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం**



పురస్కార గ్రహీతలతో అతిథులు...

కవిసంధ్య స్వర్ణోత్సవ సభ ఆదివారం స్థానిక గీతా మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సభకు కవిసంధ్య సంపాదకులు, కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షత వహించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాశి విజయ భాస్కర్ సభను ప్రారంభించి మాట్లాడారు. ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజం చైతన్యవంతం కావడానికి సాహిత్యం దోహదపడుతుందని పేర్కొన్నారు. కవులకు, రచయితలకు తగిన ప్రోత్సాహం అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కవిసంధ్య కార్యక్రమాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలిపారు.

కేంద్రసాహిత్య అకాడమీ సలహా మండలి కన్వీనర్ ఆచార్య డాక్టర్ మృణాళిని మాట్లాడుతూ శిఖామణి సాహిత్య కృషిని, కవిసంధ్య ప్రస్థానాన్ని ఆమె కొనియాడారు. ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి తదితరులు ప్రసంగించారు. సభలో శిఖామణి సాహితీ పురస్కారం సుప్రసిద్ధ కవి, విమర్శకులు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వాడ్రేవు చినవీరభద్రుడు కు ప్రధానం చేశారు. శిఖామణి తదితరులు ఘనంగా సత్కరించి, మెమోంటో, 10 వేల నగదు అందించారు. అలాగే శిఖామణి యువపురస్కారంను ప్రముఖకవి పాయల మురళి కృష్ణ కు ప్రదానం చేశారు. ఆయనను శిఖామణి సత్కరించి రూ.5 వేల నగదు అందించారు. అలాగే 12 మందికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి రూ.1016 చొప్పున నగదు అలాగే మెమోంటో అందించారు. వాడ్రేవు చినవీరభద్రుడును ప్రముఖకవి, విమర్శకులు డాక్టర్ సుంకర గోపాల్ పరిచయం చేశారు. అలాగే పాయల మురళీ కృష్ణను ప్రముఖకవి, చరిత్రకారుడు బొల్లోజు బాబా పరిచయం చేశారు. చినవీభద్రుడు, మురళీ కృష్ణ లు తమ స్పందనను తెలిపారు. డాక్టర్ శిఖామణి మాట్లాడుతూ ప్రస్థానంకు సంబంధించిన అంశాలను వివరించారు. ఇష్టం అయిన పనికి ప్రయాస ఉండదన్నారు.

ముందుగాప్రముఖకవి మదునాపంతుల సత్యనారాయణమూర్తి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. సుమారు 40 మంది కవులు తమ కవిత లను చదివారు. కవిసంధ్య 50 వ స్వర్ణోత్సవ సంచికను, అలాగే మొదటి సంచికను ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణా రావు ఆవిష్కరించారు. తొలి ప్రతిని ప్రముఖకవి, విమర్శకులు డాక్టర్ ఆర్.సీతారాం స్వీకరించారు. శిఖామణి కవితలను మలయాళంలో అనువదించిన సంపుటి ని సభలో ఆవిష్కరించారు. సభలో ప్రముఖ కవులు, రచయితలు, సాహితీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### సునందామృతం

### తండుల భక్షణ న్యాయము

తండులం అంటే బియ్యం. భక్షణం అంటే తినడం. తండుల భక్షణం అంటే బియ్యం తినడం.

బియ్యాన్ని వండుకొని తినాలి కానీ వండకుండా తినడం అంటే ఒళ్ళు బద్ధకం చేత వండకుండా తినడం అనే అర్థంతో "వండుకో లేక బియ్యం బొక్కినట్లు" అనే సామెత తో పోల్చుతూ చెప్పిన న్యాయమే "తండుల భక్షణ న్యాయము". అసలే బద్ధకస్తురాలు. పైగా ఆకలి వేస్తుంది. ఏం చేయాలో తోచక బియ్యం తెచ్చుకుని బుక్కిం దట. దీనికి సామ్యంగా మరో సామెత కూడా పెద్ద వాళ్ళు ఉపయోగిస్తూ ఉంటారు. "ఒళ్ళు ఒంగ నోడు దొంగల్లో కలిశాడు అన్నట్లు" అలా వండుకోకుండా బద్ధకంతో బియ్యమే తింటే ఏమౌ తుంది? కడుపు నొప్పి రావడం, ఆ తర్వాత అందరితో చీవాట్లు పడటం ఖాయం.

బద్ధకం మనసుకైనా శరీరానికైనా అనర్థహేతువే. కాళ్ళూ చేతులూ అన్నీ సక్రమంగా ఉన్న వ్యక్తి చిన్నదో పెద్దదో పని చేసుకుని బతకాలి.

అంతే కానీ శ్రమ లేకుండా బాగా సంపాదిం చాలని దొంగలతో కలిస్తే పట్టుపడకా తప్పదు. దేహశు ద్ధితో పాటు పరువూ మర్యాద గంగలో కలవకా మానదు.

ఇలాంటి బద్ధకస్తులను హెచ్చ రిస్తూ రాసిన పద్యాలను చూద్దాం.

పెద్దలు విచ్చేసినచొ/ బద్ధకము ననైన దుష్ట పద్ధతి నైనన్/ హద్దెరిగి లేవకున్నన్/ మొద్దు వలెం జూతురతని ముద్దు కుమారా!

పెద్దలు మనమున్న చోటుకు వచ్చినప్పుడు వెంటనే గౌరవప్రదం గా లేచి నిలబడాలి. కానీ పొగరుతోనో, చిన్నా పెద్ద తేడా తెలుసుకోలేకనో, ఆఖరికి బద్ధకం వల్లనైనా సరే మన హద్దు గ్రహించకుండా, అలానే కూర్చుండి పోయే వారిని బుద్ధి లేని మొద్దు గా, మూర్ఖు నిగా జమ కడతారు.

అలాగే కుమారీ శతక పద్యాన్ని కూడా చూద్దాం...
"బద్ధకము సంజె నిద్దుర/ వద్దు సుమీ దద్దిరంబు వచ్చును దానన్/ గద్దింతురింట వారలు/ మొద్దందురు తోడివారు ముద్దు కుమారీ!"

బద్ధకముతో సాయంకాలం నిద్ర పోకూడదు. అలా నిద్రిస్తే మొద్దువని తోటి వారు నిందిస్తారు. ఇంటివారు తూలనాడుతారన్న మాట".

తండుల భక్షణం న్యాయము అంటే ఈ పాటికి అర్థం అయ్యింది కదా! కాబట్టి అలాంటివి మానా లంటే ఒంట్లోనూ, మనసులోనూ ఉన్న బద్ధకాన్ని వీడాలి. పిల్లలైనా పెద్దలైనా బద్ధకం వల్ల వచ్చే అనర్థాలను, చెడును తెలుసుకుని చైతన్య స్రవంతులై సాగాలి.



-పురిమళ్ల సునంద
9441815722






# ప్రయోజనాత్మకతతో కూడి తెలంగాణ భాషకు పట్టం కట్టిన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారి

# ఎన్నికల శతకం "ఏడు కోలల బాయి"

పుస్తక సమీక్షలు

ప్రయోజనాత్మకతతో కూడి తెలంగాణ భాషకు పట్టం కట్టిన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారి ఎన్నికల శతకం "ఏడు కోలల బాయి". శ్రీ ఏనుగు నరసింహారెడ్డి గారు పద్యం రాస్తారు, గద్యము రాస్తారు అనువాదం చేస్తారు పైగా మంచి మనిషి, సహృదయులు, సామాజిక సేవా దృక్పథం కలవారు, సమాజాన్ని, జీవితాన్ని చిన్ననాటి నుండి బహు జాగురూకతతో పరిశీలన చేసిన వారు. అందుకు వారి జీవితము రచనలే సాక్ష్యం. వారు వచన కవిత్వం రాయడంలోనూ పద్య కవిత్వం రాయడం లోనూ దిట్ట. రచన చేయడం ఒక సామాజిక బాధ్యత ఒక సందర్భంలో సాహసం కూడా . ప్రజలను ఏలే ప్రభుత్వంలో తప్పుడు పనులు ఎందుకు జరుగుతున్నాయి అంటే మనము సరైన నాయకులను ఎన్నుకోవడం లేదు కాబట్టి అని జవాబు వస్తుంది. ఎన్నికల్లో తప్పుడు వాగ్దానాలు గుప్పించి అమలకు వీలుకాని హామీలను ఇచ్చి ఓట్లను అడుక్కునే ఎన్నికల విధానములో మన ఓటరు ఎన్నో ప్రలోభాలకు గురి అవుతున్నాడు. అదిగో ఆ ఎన్నికల బాగోతం మీదనే ఏనుగు నరసింహారెడ్డి గారు తన సాహితీ బాణాలను ఎక్కు పెట్టాడు ఓటర్లను మేల్కొల్పి పరోక్షంగా ఓటర్లను చైతన్యవంతలను చేయడం అనే సామాజిక బాధ్యత గుర్తెరిగి. ఐదేండ్లకు ఒక మారు వచ్చే ఎన్నికల వేళ ఓటరు ఎన్ని ప్రలోభాలకు గురి అవుతున్నాడో అనే విషయాలన్నింటినీ ఎత్తిచూపుతూ వారు 'ఏడు కోలల బాయి' అనే ఎన్నికల శతకాన్ని రాశారు. అలా వారు నూట ఒకటి పద్యాలు రాశారు సీస పద్యాలలో కింద రెండు తేటగీతులను ఉంచి. బాయి అంటే లోతైనది, ఒకోసారి లోతు తెలియనిది , కష్టమైనది , సంక్లిష్టమైనది అని ఇవన్నీ మనము అర్థం చేసుకోవచ్చు సాధారణంగా బాయిలవడ్డడు అంటే మునిగిపోయిండు నష్టపోయిండు కష్టపడ్డడు అని చెప్పుకోవచ్చు. ఇక్కడ దేశము అనే బాయి' గురించి చెప్పేటప్పుడు ఎన్నో విషయాలు మననానికి వస్తాయి . ఇక వారి ఎన్నికల శతకానికి వారు 'ఏడు కోలల బాయి అని పేరు పెట్టారు అంటే మన దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటింది అనే నేపథ్యంలో. సాధారణంగా తెలంగాణలో వ్యవసాయ బావులు తవ్వినప్పుడు ఎన్ని కోలల బాయి తవ్వినవు అని అడుగుతరు దాని లోతు, వెడల్పుల దృష్ట్యా. అలానే ప్రజాస్వామ్య భారతమును వారు బావి కొలతల తీరున పోల్చారు ఈ ఏడు దశాబ్దముల భారతదేశంను. ఎన్నికల పర్వంలో ప్రతిసారి ఏమేమి జరుగుతుందో అనే విషయాన్ని పద్యముల ద్వారా ఏ కరువు పెట్టారు. ఈ పద్యాలన్నీ ఇదివరకు వివిధ పత్రికల్లోను, ఫేస్బుక్ లోను వచ్చినవే పాఠకాదరణ పొందినవే. ముఖ్యంగా ఈ పద్యాలు గత ఏడాదిలోగా జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలకు అటు ఇటుగా వచ్చినాయి సమయం సందర్భం చూసుకుంటూ. వారు ప్రతి పద్యములో ఒకే మకుటపద్యం ఉంచారు . ఆ మకుట పద్యం ఏమిటి అంటే,

**"మాయ మాటల హామీల మర్మమెరిగి**
**గుర్తు లేకుండా ఓటెట్ల గుద్దుతావు?**
**ఓరి ఎంకన్న ! దోస్తుగా ! ఒర్లుబోతు!**
**ఒక్క మాటన్న వినవార ! తిక్కలోడ"** అనేది

ఈ పద్యాలకు మకుటం . సాధారణంగా సీస పద్యాల కింద ఒక తేటగీతి పద్యము ఉంటుంది కానీ చెప్పడానికి విషయం నిడివి దృష్ట్యా వారు సీస పద్యం కింద రెండు తేటగీతి పద్యాలను తీసుకున్నారు . సీస పద్యాలు కడు రమణీ యంగా అందంగా ఆకర్షణీయంగా, వినసొంపుగా పాఠకులను ఆకట్టుకుంటాయి.

**"మచ్చుకు వారి యొక్క ఒక సీస పద్యము:**
**దేశాన స్వాతంత్ర్య వేషానికప్పుడే**
**మూడు పాతికలేండ్లు మూడిపాయె**
**ప్రజల పాలన పేర పరిహాసమప్పుడే**
**ఏడు పదుల యేండ్లు ఎల్లిపాయె**
**సకల జనులకంత సమమన్న ఓటింగు**
**అడుగు వర్గము సేమ మరియదాయె**
**అయిదేండ్లకొకసారి అరుగుదెంచెడి నేత**
**తన లాభమే తప్ప తలచదాయె.**

**ఎన్నికల రాగ మెత్తుతూ ఎదురువచ్చి**
**పంచవర్షాన జరిపేరు పర్వదినము**
**దాని ఎత్తెంతొలోతెంతొ దలచగానె**
**బుర్రపిట్టోలె ఉరికేరు తుర్రుమంటు**
**మాయమాటల హామీల మర్మమెరిగి**
**గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు?**
**ఓరి ఎంకన్న! దోస్తుగా! ఒర్లుబోతు!**
**ఒక్కమాటన్న వినవార! తిక్కలోడ!"**

ఇలా వారు బహు చక్కగా పద్యాన్ని జన సామాన్యమైన తెలంగాణ భాషలో చెప్పారు. ఒక సందర్భంలో ఇంతకు పూర్వం తెలంగాణ భాష కవిత్వం రాయడానికి పనికిరాదు, పద్యం రాయడానికి పనికిరాదు అనే వాళ్ళు ఉంటే ఉండవచ్చు, అవన్నీ కాదని తెలంగాణ భాష అచ్చు గుద్దినట్లు పద్యములో ఇమిడిపోతుంది సొగసుగా అని తన పద్యాల ద్వారా అందులో సీస పద్యాల ద్వారా రాసి నిరూపించారు . అలా తెలంగాణ భాషకు పట్టం కట్టారు నరసింహారెడ్డి గారు. ఒకనాడు సినిమాల్లో జోకర్లు విలన్లకు వాడబడిన తెలంగాణ భాష నేడు కావ్య భాష , ప్రజల భాష అయి చివరికి సినిమాల భాష కూడా అయినందుకు తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత సర్వజనము ఆమోదం పొందినందులకు గర్వపడదాం. ఈ పద్యాలు ప్రేయసి ప్రియుల మీదనో, ప్రకృతి పర్యావరణ మీదనో రాసిన పద్యాలు కావు ఇవి పూర్తిగా సామాజిక ప్రయోజనం ఆశించి ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రజల భాషలో రాయబడిన చక్కటి పద్యాలు . ఏడు కోలల బాయి ఎన్నికల శతకం పేరు లోనూ పద్యములలోనూ ప్రతి పద్యం ఒక తెలంగాణీయం ! ఒక ప్రయోజనం ఆశించి ఎన్నికల భారత పర్వాన్ని పద్యంలో రాసిన ఏనుగు నరసింహారెడ్డి గారికి అభినందనలు చెప్పవలసి ఉంది అందరూ ప్రాంతాలకతీ తంగా. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ నుండి ఎందరో కవులు రచయితలు ఈ పుస్తకములోని పద్యాలను పత్రికలోనూ , ఫేస్ బుక్ ద్వారాను



ఏడుకోలల బాయి
ఎన్నికల శతకం
ఏనుగు నరసింహారెడ్డి



**ప్రతులకు:**
పాలపిట్ట బుక్స్ ,
హైదరాబాద్.
ఫోన్ : 9848787284.

చదివి వీటిని ఆహ్వానిస్తూ తమ అభినందనలు తెలియజే యడం గొప్ప విషయం.

ఈ పద్య కావ్యం లో 101 పద్యాలు ఉన్నాయి, అన్నీ సీస పద్యాలే . ఈ పుస్తకం గొప్పతనం తెలియజేస్తూ ప్రసిద్ధ కవులు సీతారాం, పాలపిట్ట గుడిపాటి, చరిత్ర పరిశోధకులు డాక్టర్ సంగనబట్ల నరసయ్య, సాహిత్య ప్రేమికుడు సామల రాజ వర్ధన్ గారు మంచి ముందు మాటలు రాశారు. ఈ పుస్తకాన్ని నర్రా ఫౌండేషన్ వారు అభిమానంతో ప్రచురించారు. ఈ పుస్తకము యొక్క మరింకో గొప్పతనం ఏమిటి అంటే పుస్తకావిష్కరణ కార్యక్రమం అత్యంత నిరాడంబరంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో ఓ వీధి చౌరస్తాలో జరిగింది. సిరివంగి భాగ్య అనే మాజీ వార్డు సభ్యురాలు అయిన ఒక సాధారణ మహిళ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచి మూడు దశాబ్దాలు ఎమ్మెల్యేగా పనిచేసిన మచ్చలేని రాజకీయ నాయకుడు నర్రా రాఘవ రెడ్డి గారికి అంకితం ఈయబడింది. రాఘవ రెడ్డి గారి స్వగ్రామమైన వట్టిమర్తి గ్రామమే ఈ పుస్తకావిష్కరణకు వేదిక అయింది. కొన్ని రచనలు యాదృచ్ఛికంగా మనసులో ఉండబట్టలేక తల్లి గర్భంలోంచి పుట్టినట్లు తన్నుక వస్తాయి. అలా సహజంగా పుట్టినవే ఈ పద్యాలు. సమాజం ఎప్పటికీ కవిత్వానికి ప్రతిబింబమే ఈ పద్యాలు కూడా అంతే . విశేషంగా ఎన్నికల సీజన్లో అందులో 2023, 24 అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికలకు అటు ఇటుగా పుట్టినాయి సహజంగా. అలా ఇవి

'నవ తెలంగాణ' , 'ఆంధ్రప్రభ ', 'నేటి నిజం' దిన పత్రికలలలోనూ, మూసి, విశాలాక్షి, అక్షరాంజలి , పాలపిట్ట పెన్నవర్స్ వాయిస్ మాసపత్రికల్లోనూ ప్రచురించబడి విశేషంగా పాఠకుల ఆదరణ పొందినాయి. ఇక ఎన్నికల పద్యాల పుస్తకంలోకి వెళ్లితే కాంటెంట్ ఎన్నికల పర్వము, ప్రదేశం భారతదేశం, నాయకులు ప్రతి నాయకులు సామాన్య ఓటరు రాజకీయ నాయకులు.

ఈ నేపథ్యంగా వారు బహు మంచి పద్యాలు చెప్పినారు. వ్యంగ్య బాణాలు వదిలినారు. పద్యాల లోకి వెళితే నిజంగా వాటికి వ్యాఖ్యానాలు అవసరం లేదు. అసలు వీటికి వ్యాఖ్యానము చెబితే ఏనుగు బొమ్మ గీసి మళ్ళీ ఏనుగు గురించి చెప్పినట్లు ఉంటుంది. సులభ గ్రాహ్యమైన వేమన పద్యాలకు వ్యాఖ్యానము ఎందుకు? అలానే ఏనుగు నరసింహా రెడ్డి గారి పద్యాలకు కూడా వ్యాఖ్యానం అవసరం లేదు. పాఠకులు ఆరుద్ర గారి 'త్వమేవాహం' చదువుకుంటుంటే తప్పనిసరిగా టీకా తాత్పర్యాలు వివరణలు అవసరం అవుతాయి.

ఇక్కడ ఏనుగు నరసింహారెడ్డి గారి 'ఏడు కోలల బాయి' ఎన్నికల పద్యాలు వేటికవే వ్యంగ్య బాణాలు, సమాజం పై సెటైర్లు . వారు ఎన్నికల భారతంలో రాజకీయ నాయకులు ఓటరుకు మధ్య ఓట్ల సందర్భంలోని విషయాల్ని , సన్నివేశాలని వదిలిపెట్టకుండా ప్రతి సందర్భాన్ని పద్యమయము చేశారు చక్కగా నేర్పుతో. పేజీ నెంబర్ 37 లోని 3 వ పద్యంలో వారు ఇలా చెప్తారు.
" ఎన్ని వంకర మాటలెన్ని టింకర బుద్ధు లెన్ని కుత్సితములు ఎంత బలుపు
ఎన్నెన్ని కూతలో ఎన్నెన్ని బూతులో ఎట్లున్న పాలిటిక్సెట్టులాయే
ఎవని కాళ్ళకు కట్టెలెట్లుబెట్టగ వలె
ఎవని వెన్నున బాకు నెట్లు దింపు
డెన్ని అబద్ధాలు ఎన్ని నివొద్దెలు
ఎంతలా తెలివున్న ఎరుంగలేము''.

అని వారు రాజకీయ నాయకుల యొక్క స్వభావాన్ని వారు చేసే మోసపు పనులను, వంకర పనులను గురించి చెప్పారు. ఇక వారు పద్యాలలో అడుగడుగున సొగసైన తెలంగాణ భాష పదాలను వాడారు. తెలంగాణ భాష చాలా ముద్దుగుంటది, ఆ భాషా సౌందర్యముకు ఎవరైనా ముగ్ధులవుతరు. ఇక్కడ పద్యంలో వారు "డెన్ని అబద్ధాలు ఎన్ని నివొద్దెలు" అని చెప్పారు. నిజంగా ' నివొద్దెలు ' అంటే నిజాలు అని అర్థం. తెలంగాణలో విన్న వాళ్ళకే తెలుస్థాయి ఇట్లాంటి పదాలు. ఇంకో పద్యంలో వారు ఇలా చెపుతారు,

**"తిండి లేకున్న ఎన్నిక తీపి ఏమి?**
**మందు లేకున్న తిండిలో మజయె లేదు**
**అందురన్ని పార్టీల వారందజేస్తు/**
**నాల్గు రోజులు నడిచేను నాటకాలు"**

ఓటర్లకు మందు పార్టీలు ఇవ్వనిది మజాయే లేదు కదా అంటారు. మజా ఇది ఉర్దూ పదం ఇక్కడ

ఇక ఓట్ల ప్రచారంకు రాజకీయ నాయకులు వెళ్ళే తీరును ఇలా చెప్పారు వారు.
"బైలెల్లెనే సారు బైరంగ సభలకు
సోలుపూతుగ కార్ల సోకుతోడ
ఒక్క గంటే సభ ఒకకోటి ఖర్చొను
వెంటొచ్చు నేతల్ది వేరె ఖర్చు
రంగురంగుల బల్బు హంగులన్నీ తీర్చ
లోకలు లీడర్ల చాకిరొను
బారికేడ్లను పెట్టి బాజాలు మోగించి
పిలువంగ పాడెగా పాత పాట
సృజన అన్నది అసలేది, సుత్తిదప్ప
బాగు చేయాలి అనుకునే భావమేది
రాజకీయాలు అంటేనె రచ్చలాయె
ఒక్కదన్నను తెలునా సొక్కపోదు?''

ఇక్కడ, "బైలెల్లెనే సారు బైరంగ సభలకు" అనే దాంట్లో
సారు అంటే ఎవరో ఊర్కే గ్రహిస్తారు పాఠకులు, "బైలెల్లడం, బైరంగ సభ , సొక్కపోడు అనే పదాలు పూర్తిగా తెలంగాణ ప్రజల వాడుక భాషా పదాలు.

ఇక కండువాలు మార్చుతూ పూటకో పార్టీని మార్చే రాజకీయ నాయకుల గురించి చెపుతూ ఇలా అంటారు.
"గోడెక్కి తిరుగుతూ గోచరించెడి పిల్లి
ఎటువైపు దూకునో ఎవ్వడెరుగు ?
లూటి బోయిన చేలు దాటుతుండెడి బర్రె
ఏ చేల ఎపుడుండు ఎవ్వడెరుగు ?
కంచెర గాడిదల్ కదలకుండా తొవ్వ
నడుచునంటెవ్వండు నమ్మగలడు ?
నడిపేటి వాడినే నయవంచనల్ జేయు
మందల నెవడేని మల్పగలడె ?" ఇది నేటి రాజకీయ నాయకుల నైజం. ఇంకా, "
"ఏరోటికాడుండి ఏ పాట బాడితే ఏ
ఫాయిదావచ్చు నెరగ వలెను ?.. "నేతి బీరల లోన నెయ్యెంత ఉండునో అటులనే మన మాట లాడవలెను."అంటారు.

ఇక తాగుడు లేందే ఓటరును ప్రలోభ పెట్టలేం కదా అదే విషయాన్ని చెపుతూ , "**ఊరూర పార్టీలు సారాయి దించేరు సారాయి అన నాటుసార గాదు!??.. బ్లాక్డాగు ఉంటుంది బ్లండరూ ఉంటుంది టీచరూ ఉంటుంది స్కాచ్ ఉంది! కొత్త బ్రాండొచ్చెనా కొనితెత్తు తప్పక కాదని కొసిరేంత ఖర్చుగాదు**

**కల్లు తాగిన వాడెపో కంసుడంటే! బీరు దాగిన వాడెపో భీముడంటే! / తాగనోడెవ్వడున్నడీ ధరణి మీద / ఏమి దాగని వాడెపో ఎదవ కొడుకు!"** అని కడు వ్యంగ్యంగా చెపుతారు.

ఇక ఎన్నికలు అంటేనే "ఏడుకోలల బాయి" అని చెపుతూ,
"కోవర్టులుంటారు కోఆపరేషన్ కు సైలెన్సుగా పార్టి సైడు జేయ ఎన్నికల్ అంటేనె ఏడు కోలలబాయి తరగదు దిగుతుంటే దస్కుభూమి,,,," అంటూ అర్థం చేసుకోవాలి అంటారు. ప్రజాస్వామ్య భారత దేశమున పార్టీలు ఎక్కువ, ఎన్నికల పాట్లు ఎక్కువ, అవినీతి ఎక్కువ , ఈ ఎన్నికల బాగతంలో అవినీతి, ఓటుకు నోటు వ్యవహారం తగ్గాలంటే దేశంలో ఒకటి రెండు పార్టీలు ఉంటే చాలు అని అంటున్నారు వారు ఇలా:

**"పాలనతో పాటు మారాలి 'పోలు' స్థితులు**
**ఓటుకును నోటు బంధమ్ము దాటవలెను**
**రెండు పార్టీల పద్ధతుల్ ఉండెనేని**
**డబ్బు లంకెలు కొంతైన దస్సిపోవు"** అంటారు

వారు చైనా , అమెరికా దేశాలను ఉదహరిస్తూ. ఇలా నరసింహారెడ్డి గారి ఎన్నికల పద్యాలు హాట్ హాట్ గా, నాట్ నాట్ గా ఉన్నాయి, వేడి వేడి మిరపకాయ బజ్జీలలా, పప్పు వడాల్లా ఉన్నాయి ఆరగించడానికి, చదువుకోవడానికి.

పుస్తకం యొక్క ముఖ్య లక్షణం, చదివించే గుణం ఉండాలి, పాఠకుణ్ణి పట్టుకొని చదివించాలి.

అలా పుష్కలంగా చదివించే గుణం ఉన్న , ప్రయోజనాత్మకంగా వ్రాయబడ్డ మంచి పుస్తకం డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారి ఎన్నికల శతకం "ఏడు కోలల బాయి ".



- సబ్బని లక్ష్మీ నారాయణ
సెల్:8985251271

# వ్యంగ్య ప్రధానంగా 'నానీ కిరణాలు'

**-పుస్తకావిష్కరణ సభలో వక్తలు**



'నానీ కిరణాలు' ఆవిష్కరణలో ఎన్.గోపి, సూర్యధనుంజయ్, ఎస్.రఘు తదితరులు.

'నానీ కిరణాలు' కవిత్వంలో స్త్రీ సాధికారత ప్రస్ఫుటిస్తోందని చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ సూర్యాధనుంజయ్ కొనియాడారు. సెల్‌ఫోన్ వాడకం వంటి అంశాలనూ కవిత్వీకరించడం బాగుందన్నారు. కాంచనపల్లి రవికాంత్ రచించిన 'నానీ కిరణాలు' కవితా సంపుటి ఆవిష్కరణ రవీంద్రభారతిలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యాధనుంజయ్ మాట్లాడుతూ రవికాంత్ కవిత్వం సరళంగా పాఠకుల హృదయాలను హత్తుకొనేలా ఉందని ప్రశంసించారు. ప్రఖ్యాత కవి ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ.. ఈ కవితా సంపుటిలో ఎంతో వస్తు వైవిధ్యత ఉందన్నారు. సమకాలీన విషయాలతో పాటు వ్యంగ్య ప్రధానంగా సాగే కవిత్వం పాఠకాదరణ పొందుతుందనడంలో సందేహం లేదని చెప్పారు. వర్తమాన కవులు నానీల ప్రక్రియ ద్వారా వచన కవిత్వంలోకి అడుగు పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కవి ఎస్ రఘు సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్, దాసోజు లలిత, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, కూరెళ్ల శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంగీతం పరమపవిత్రం



తెలుగు బుక్ రికార్డును అందజేస్తున్న అతిథులు

భారతీయ సంగీతం పరమ పవిత్రమైనదని ఏపీ అధికార భాషా సంఘం పూర్వ చైర్మన్ పి. విజయబాబు అన్నారు. రఘు అరికపూడి సేవాట్రస్ట్ కళా నిలయం ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బలక్ష్మి 108వ జయంతి సందర్భంగా 108 గాయనీ గాయకులతో శాస్త్రీయ సంగీత గాన గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ సంగీతానికి ప్రతిరూపం సుబ్బలక్ష్మి అన్నారు. గాయని హైమవతి భీమన్న మాట్లాడుతూ సుబ్బలక్ష్మి భారతరత్నగా కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏకైక శాస్త్రీయ సంగీత విదుషి అన్నారు. వంశీ రామరాజు వైఎస్ఆర్ మూర్తి, ఎస్.పి. భారతి పాల్గొన్నారు.

# సాహిత్య అవగాహనతోనే గొప్ప పాటలు రాయగలం

**- ప్రముఖ గేయరచయిత, సినీ ఆర్టిస్టు మౌనశ్రీ మల్లిక్**




మౌనశ్రీ మల్లిక్‌ను సన్మానిస్తున్న అతిథులు.




సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ. వేదికపై గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ తదితరులు.

సమాజంలోని సాహిత్యాన్ని చదివినప్పుడే గొప్ప పాటలు రాయగలం అని ప్రముఖ గేయ రచయిత, సినీ ఆర్టిస్టు మౌనశ్రీ మల్లిక్ తెలిపారు. సాహిత్య అవగాహనతోనే ఇండియన్ ఫైల్స్ అనే సినిమాలో తాను పాటలు రాయగా ఎం.ఎం.కిరవాణి పాడిన **'తిరిగి చూడు'** అనే పాట తనకు ఎన్నో అవార్డులు, ప్రశంసలు తెచ్చిపెట్టిందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ 7వ తెలంగాణ రాష్ట్ర సదస్సు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మౌనశ్రీ మల్లిక్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం యువత సాహిత్యంపై అవగాహన పెంచుకోవడానికి కృషి చేయాలన్నారు. నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ బహుజన సాహిత్యం ముందుకు తీసుకెళ్ళడం కోసం వచ్చే డిసెంబర్ 10వ తేదీ దేశ రాజధాని న్యూఢిల్లీలో వెయ్యిమందితో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమీ సంస్థ కర్నాటక రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.డి.వెంకమ్మ, ఏపీ రాష్ట్ర కార్యదర్శి నేలపాల ఫణికుమార్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మామిడాల సంతోష్‌రెడ్డి, నజర్‌పాషా, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# భాషా సాహిత్యాలలో ప్రతిభాశాలి దివాకర్ల




సభలో ప్రసంగిస్తున్న మధుసూదనాచారి. వేదికపై రమణ వెలకమన్ని, కళా జనార్ధనమూర్తి తదితరులు.

భిన్న భాషా సాహిత్యాలలో ప్రతిభాశాలి దివాకర్ల వెంకటావధాని అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆదివారం ఎందరో, మహానుభావులు కార్యక్రమం పరంపరలో భాగంగా దివాకర్ల వెంకటావధాని సంస్మరణ సమావేశం కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. దివాకర్ల సాహిత్య పరిశోధకుడు, విమర్శకుడు పలు సాహితీవ్యాసకర్త అన్నారు. కీలక ప్రసంగం చేసిన ప్రముఖ విమర్శకులు, సాహితీవేత్త రమణ వెలమకన్ని మాట్లాడుతూ ఆయన శిష్యరికంలో ఎందరో ప్రముఖులుగా గుర్తింపు పొందారన్నారు. వారిలో సినారె లాంటి వారున్నారన్నారు.



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం-కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

-సంపాదకులు..

## మంటల్లో మల్లియలు

శ్రీలు పొంగిన జీవగడ్డలో
విలువలు తగలడిపోతున్నాయి
భారతీయ ఆధ్యాత్మిక సంపద
విలువల భాండాగారం
వేదాలు పురాణాలు కొండొకచో
నేలమాళిగలవుతున్నాయి
అటకెక్కించిన ఆదికావ్యపు బూజులు దులపండి
అద్దంలో చంద్రుని కాదు అడ్డాల నాడే
విలువలు బోధించండి
నైతికతను ఉగ్గుపాలలో రంగరించండి
నీతి చంద్రిక వేమన శతకాలకు భాష్యం చెప్పండి
ముద్దుల మూటగట్టే మురిపాల బొమ్మ మంటల్లో
మల్లెపూ వవుతోంది
ముంగిట విరిసిన గులాబీని
అమ్మ వారి కొప్పున తురమాలి
గడప లోపలి అపరంజి
గౌరమ్మ మెళ్ళో హారమై మెరవాలి
చావిట్లోని ముత్యాల కొమ్మ కోవెల్లో
దీపమై వెలగాలి
ముత్యపు ముంగిట నడయాడిన ముద్దుగుమ్మ
ముగురమ్మల మూలపుటమ్మై
హారతులందుకోవాలి
పరాశక్తి మృదుమందహాసమే నింగి నేలకు
పచ్చని తోరణం
త్రిలోక జనని చిరుదరహాసమే
లోక కళ్యాణానికి మంగళవాద్యం.
-పద్మశ్రీ చెన్నోజ్వల

## అందాలహరిణం

అదొక జింకబొమ్మ
నే ముచ్చటపడ్డ
కొయ్యబొమ్మల కొట్టు నుండి
కూడా వచ్చి
నిర్మల్ జింక నా షెల్ఫ్ లో
నిమ్మలంగా కొలువై వుంది
మచ్చల జింక
చూడ ముచ్చటగా వుంటుంది
మూగజంతు ప్రపంచానికి అదొక ప్రతీక
ప్రతీ ఉదయంలో
అచ్చమైన అమయాకత్వం ఒలుకుతుంది
నా హృదయంలో
అందంగా సాధుతత్వం ఒంపుతుంది
జాలిదయా ప్రేమగుణాలు నాటుతుంది
తన కళ్ళతో
చెవులజింకచెలువం అచలంగా
దారుశిల్పమైవున్నా కవులభావాలను కమ్మంగా
మీటుతుంది నా గుండెల్లో
అనుకోకుండా జారిపడింది హాలుగదినేలపై
చుక్కలజింక ఆ అందం ముక్కలైపోయింది
వేటగాడి వేటుకుమల్లే
తన మెడ నుండి మొండెం విరిగింది
బాధ మొలకెత్తి నామనసులో పెరిగింది
విరిగిన జింక సరిచేసేవిరహం
వృక్షంగా ఎదిగింది లోలో
ఒక మధ్యాహ్నం ముహూర్తం కుదిరింది
మంచుతెలుపు ఫెవికాల్ఎమల్షన్ బంక
అతికించింది జింకదేహానికి తలను
గాజురంగు టేపు వేలడంత మెడకు
చుట్టి కట్టుకట్టగా
మెరిసింది మేరుపుహరిణంలా
తీరింది నా కల
తనివితీరింది నాకు
మరలా మూగదనం మూర్తీభవించి
జింకబొమ్మ మునుపటిదాని బొమ్మల జగత్తులో
మచ్చల జింక ముచ్చటగా కొలువైంది
ఆ షెల్ఫ్ లో జలచక్రంలా
షెల్ఫ్ లో మరలా ఒక అందం
నాలో ఒక ఆనందం వెల్లివిరిసింది.
-రమేశ్ నల్లగొండ

## ఈ క్రౌంచ ద్వీపపు వీధుల్లో....

నా కంటిలో శరదృతువు
నేనేనా? వీధుల్లో నడిచేది? నేనేనా?
ఔనా? నిజమేనా?
కనిపించే శరదృతువు ఇంతందంగానా?
తెల్లని తుషారం - పచ్చిక మేలిముసుగేసుకున్నది...
రంగు రంగుల పూలన్నీ రవికకు రంగులద్దినట్టున్నవి
పచ్చిక మీద వాలిన బ్లూ బర్డ్స్ రెడ్ రాబిన్స్
చీరకు కుట్టిన డిజైన్ల వలె ఉన్నాయి.
బుర్రుపిట్టలు-కుందేళ్ళు,
పండగకొచ్చిన పసిపిల్లలవలె గెంతులేస్తున్నాయి....
భళెభళే జింకల కుటుంబాలు షికారుకొచ్చి
తలలమీద పూల పుప్పొడితో పెళ్ళి కూతుళ్ళవలె
హ్యాయలొలుకపోస్తున్నాయ్!
చేనేతకార్మికుడివలె నైపుణ్యంతో రేవెన్ పక్షులు
అందమైన గూళ్ళల్లుతున్నాయి...
ఫీ..ఫీ..అంటూ పాత హార్మోనియం నొక్కులవలె
కూనిరాగాలు తీస్తున్నాయి...
చిమ్మటతో బంగారునగ పట్టినట్టు..
ఎరుపుముక్కుల తెల్లకొంగలు
చేపలనొడిసి పడుతున్నాయి...
రాచబిడ్డలవలె - హంసజాతి పక్షులు
రాజసమొలకపోస్తున్నాయి...వాటర్ హార్వెస్ట్లలో
సర్కస్ పిల్లల వలె...
అక్కడదో తెల్లచారల పక్షి గిరికీలు కొడుతున్నది
వడ్రంగి పిట్ట ముక్కుతో టక్కూ..టక్కూ.మంటూ
డోలక్ వాయిస్తున్నాయి...వత్తాసుగా...
ఈ పక్క గుబురు చెట్టు గుబులుగా తనను
చూడలేదనుకుంటున్నదేమో?
కాకులన్నీ కావ్..కావ్ మంటూ
సమ్మె నినాదాలవలె రొదచేస్తున్నాయ్!
ఆకులు రాలి నిట్టూరుస్తున్న చెట్లకు
ఆనందం కలిగించాలని ఆరాటపడుతున్నాయి
ఆశ్రిత జీవులు...
తేలియాడే తెలిమబ్బులపై
సూర్యోదయ వెండి వెలుగులు..
ఎఱుపూ-తెలుపూ కెంపులు- వజ్రాల చేతి
కంకణాల వలె ఉన్నాయ్!
ఓ జీవిత కాలం ఆలస్యంగా తుషార- శీతల
పదాలకర్థం తెలిసింది...
పక్షపాతంలేని తల్లి వలె ప్రకృతికాంత
ఆనంద- విషాదాలు సమంగా పంచుతోంది!
అంతేగా ! మరంతేగా!కాలమొక్కరీతి గడపాలి!
-రంగరాజుపద్మజ.

## కన్నెర్ర చేయమంటారా!

ప్రాణాలు తీయొద్దని
ఇల్లిల్లు తిరిగినోళ్లం
ఏడేడు చెరువుల కన్నీళ్ళె
మొక్కుతున్నం
బతుకుదెరువు లేనోళ్ళం
ఏరవిషపు గాలినైనా
ఇష్టంగానే పీల్చుకున్నం
తలేలా పిరికెడు అన్నం ఉన్నా లేకున్నా
కొట్లంలో నీళ్లు తాగి పడుకున్నం
మేమేమ్ ఎల్ఈడీ లైట్లతో వెలిగిపోతలేము
మిణుగురు పురుగుల లెక్క
మిణుకు మిణుకు మంటూ
కాలం ఎల్ల దీస్తున్నోళ్ళం
మమ్ములను ఇట్లా దిక్కులేని పక్షులను
చెయ్యొద్దు
తప్పు ఎవరిదో
తట్టు తాకింది ఎవరికో
మీ బిడ్డల మనుకో
ఇట్లా బతకనీయండి
ఉన్నది ఉన్నట్టుగా ఉంచి
ఉసురు తీయకుండ్రి
గట్టిగా గాలొస్తే
కనబడకుండా కొట్టుకపోయేటోళ్లం
మమ్ములను కూల్చితే
ఏమొస్తది?
మీ పెద్ద పెద్దోళ్ల మంచి పేర్లంతా
మా మీదనే సంపాదించాలా తండ్రి!
చేయాలంటే ఎన్నో పనులు లేవా !
ఇంత దానికే నా
గొప్ప పేరు ఎందుకు
గరీబ్ బతుకునే వనవాసం పంపకుండ్రి
ఇంకా ఏడ చెప్పుకుందుము !
మీరే దిక్కు
మట్టి లో మట్టిగా
మురికంతా మేమే అయి
బతుకు ఎల్ల తీసుకునేటోళ్ళం
ఎన్ని ప్రభుత్వాలు మారినా
మేము ఇక్కడే ఉన్నాం కదా!
ఎవరు ఎప్పుడు ఒక్క మాట అనలేదు
మా మీద కన్నెర్ర చెయ్యకుర్రి
పుట్టినందుకు బతుకు ఎల్లదీస్తున్నాం
చావలేక బతకలేక
కలిగంజి తాగి బతికేటోళ్ళము
కనికరించుమని వేడుకోమా!
కన్నెర్ర చేయమంటారా!
-గుండెల్లిఇస్తారి
9849983874

## లెఫ్ట్

మనుషులైన వారికి
కుడిఎడమల భేదమేల ?
కడుపు నిండుతుందా కుడిలేనిదే!
వృర్థాలు శుభ్రమౌతాయా?
ఎడమనుఏర్పరుచుకోనిదే!
కుడిఎడమనే అంతరాలేల?
అవే లేకపోతే ఆరోగ్యం అంపశయ్యపాలే!
అందుకే నేనంటాను
ఎవరి పనులకు అడ్డుపడుతూ
నిందించుకోవటం జాతికి అభాగ్యమని
అందరు కుడివాళ్ళే కావచ్చు
ఎడమ కొందరే ఉండొచ్చు
ఎవరి స్వార్థం కొరకు కుడిఎడమలు
మానవత్వం మరచి కట్లాడుతాయి!
వాదోపవాదాలపాలౌతాయి!
ఈర్ష్యా ద్వేశాలువర్గాలుగా చీలి
కుటుంబమంత సమాజం విచ్ఛిన్నంచేస్తారు!
జనులను చేర్చుకొని ప్రసంగాలతో
మల్చుకొంటారు
పురాణేతిహాస వాదులుగా
హేతువాదులుగా శాస్త్రవాదులుగా
ఎవరికోణాల్లవాళ్ళు
ఆలోచన ప్రవంతిని పదును పెడుతూ
అనుకూలమైన అవకాశం కోసం
ఎదురు చూస్తుంటారు
నిరూపణల సముద్రములో
మునిగి తేలుతుంటారు
పురాణాల వాదనలతో శాస్త్రీయ వాదనలతో
మానవతావాదంతో మనస్సున్నవాళ్ళు ఏకతకై
పోరాడుతున్నారు ఓడుతున్నారు
అబద్దాలకు జీవం పోసినంతగా
నిజాలను బతుకనీయరు
వాస్తవాలు వాళ్ళ చేతిలో అవస్తవాలుగా
గగ్గోలు పెడతాయి
సామ దాన భేద దండోపాయాల
మహాయజ్ఞంలో
సమిధలుగా ఆహుతి కావల్సిందేనా!
-సుదర్శనం వేణుశ్రీ

## ఒంటరిగానైనా

న్యాయాన్ని కప్పుకున్న
మేక తోలు పులి మాటలు
మంత్రముగ్ధమై
మనసు దోస్తాయి
నిజం
నిష్ప్రయోజనమై
దిడ్డిదారి పడుతుంది
సామాజిక న్యాయం
నేతిబీరకాయ
భ్రమలు కలిగిస్తుంది.
తెర ముందర ప్రజాస్వామ్యం
ప్రాణం లేని బొమ్మ లాట
తెర వెనక ధనస్వామ్యం
తన్నుకపోయే చెలగాటం.
ఎవరు నల్లా అనరు
ఎవరు తెల్లా అనరు
ఎవరికి ఎవరు ఏమవుతారన్నట్టు
తెల్లవారు తేదీ మార్చుకొని
క్యాలెండర్ దిగులు పడుతుంది.
అనాదిగా వస్తున్న
పునాదులు కూలిపోయి
మనుషుల మధ్య చిత్రమైన
గోడలు కట్టుకుంటాయి
నమ్మకాన్ని ద్రోహం చేస్తూ
ఒకే గడియారం రెండు ముఖాలు
వేరువేరు కాలాలను
తలపింప చేస్తుంది
మాటల వెనుక దాగిన చీకటి
ముఖం కనిపించనీయదు
దశాబ్దాలుగా మనం
తప్పుడు గమ్యం వైపు నడుస్తున్నాం
ఇంత దూరం నడిచాక
జతికిన దగ్గర
జాగ్రత్త పడితే సరిపోదు
ఒంటరిగానైనా
ఒక కొత్త దారి నిర్మించుకోవాలి
-బెల్లంకొండ సంపత్ కుమార్
99085 19151.

## ధైర్యం

మాటకైనా పాటకైనా
జలజల పారటానికైనా
ధైర్యం కావాలి !.
గుంత తవ్వటం
పూడ్చటమూ కష్టమే !.
ఇది నా సొంతం దీన్ని తాకటానికి వీల్లేదు
ఇది నా గెట్టు దీన్ని దాటడానికి వీల్లేదు
అనటం ధైర్యం !.
అడవి ఎవరి జాగీరు కాదు
అది ఆకాశం !.
వాన చినుకులు పడ్డప్పుడే వినియోగించుకోవాలి !
వాటి మీద హక్కు ఎవరికీ లేదు
ప్రకటనకు ఒక ధైర్యం కావాలి !
దేశం ఎవరి గుత్త సొత్తు కాదు
మెల్లమెల్లగా ఆక్రమించుకోవటం
ఆధిపత్య సామ్రాజ్యవాద లక్షణాన్ని ఎదిరించే
గొంతుకు ధైర్యం కావాలి !.
కత్తి దూసిన మాట నిజం
వెనక్కి తీసుకోవడం ఎట్లా ?
ఇది యుద్ధరంగం !
వీరునికి ముందడుగు వేయటమే తెలుసు
ముందుచూపు ఉండటమే తెలుసు.
నాగలి పట్టి దున్నటానికైనా
మట్టిలో విత్తు నాటడానికైనా
చినుకుపడ్డా పడకపోయినా
విత్తు మొలిపించటం ధైర్యం !
కళ్ళు మూసుకున్నా తెరుచుకున్నా
ఒకే దృష్టి
గుండె నిబ్బరం ధైర్యం కావాలి !.
పొలను పల్లగా చేయటం సులభం
పిరికి మందును నూరిపోయటానికి
శ్రమ పడాల్సిన పనిలేదు
భయపెట్టడం ఏమంత కష్టము కాదు
చాతి విరిచి తుపాకికి ఎదురొడ్డి పోరాట్టం
కర్రకు జెండా కట్టి భూమిలో
పాతటం ధైర్యం కావాలి
దూదిపింజ లాంటి గుండె కదా
పిడుగు పడుతున్న శబ్దం వినాలి !
అప్పుడే గుండె ఇనుమవుతుంది !!
ధైర్యం ఇనుముడింప చేస్తుంది !!!
- కందుకూరిశ్రీరాములు
9440119245

పుస్తక సమీక్ష

# నవరత్నాల సాహితీ 'బటువు'- డా॥ త్రివేణి వ్యాస సంపుటి

తెలంగాణ ప్రాచీన కవిత్వం, ఆధునిక, వచన సాహిత్యాలకు చెందిన తొమ్మిది వ్యాసాలను రచయిత్రి డా॥వి. త్రివేణి సంపుటిగా ప్రచురింపచేసారు. రాష్ట్రపతి అవార్డు **'మహర్షి బాదరాయణ వ్యాస్ సమ్మాన్'** పురస్కార గ్రహీత డా॥ వి. త్రివేణి ఈ సంపుటికి బటువు (పెండ్లి కొడుకు ఉంగరం) శీర్షిక పెట్టడం ఆమె సంస్కృతీ సంప్రదాయాల అస్తిత్వ అనురక్తి వ్యక్తం చేస్తోంది. పోతన కవిత్వం-అనువాద సంవిధానంలోని స్వతంత్ర, భావ, యధా తథానువాద విశ్లేషణ డా॥ త్రివేణి బోధనాధ్యయన పరిశోధనాత్మక ప్రతిభా ఉత్పత్తులను స్పష్టం చేస్తోంది. వివిధ జాతీయ అంతర్జాతీయ, సాహిత్య సదస్సుల్లో పత్ర సమర్పణగాను, ఎంపిక చేసి పొందుపరిచిన ఈ వ్యాస సంపుటిలో నవరత్న సాహితీ దీప్తి ద్యోతకమవుతోంది. **"కాళోజీ కథలు- స్థానికత, నవీనత'** వ్యాసంలో 1940-50 దశకాల తెలంగాణ జనజీవన సామాజిక స్థితిగతులు కాళోజీని కథా రచయితగా ఎలా కదిలించిందీ రచయిత్రి విశ్లేషించారు. **'పొట్లపల్లి రామారావు కవిత్వం- వస్తు శిల్పం'**లో భాష, సంస్కృతి, సమాజ నడవడిక ముఖ్యంగా తాత్త్విక, మార్మిక భావనలు, ప్రతిబింబిపచేసారు. **'హైదరాబాద్ స్టేట్ కథ- ప్రాంతీయ నేపథ్యం'** వ్యాసంలో, తెలంగాణ కథా రచయితలు కథా ప్రక్రియను, కేవలం ఉబుసుపోకగా కాకుండా సామాజిక ప్రయోజనం, కొత్త దార్శనిక పంథాను ఏ విధంగా ప్రదర్శింప చేసారో రచయిత్రి ప్రస్ఫుటీకరించారు. అదే విధంగా **'తెలంగాణ కథ-గల్ఫ్ వలస చిత్రణ'** వ్యాసంలో గల్ఫ్ వలస జీవన వేదన, తెలంగాణ పల్లెలలో వలసలు సృష్టించిన సామాజిక, ఆర్థిక సంఘర్షణలను కథా రచయితలను ఎలా ప్రభావితం చేసిందీ, వ్యాస రచయిత్రి కళ్ళకు కట్టించారు. **'మూల మలుపు- ప్రతీకాత్మక దృశ్యమానం'** ఆరవ వ్యాసంలో డా॥ త్రివేణి, **'మూలమలుపు'** కవితా సంపుటిలో ఆధునిక కవి డా॥ఏనుగు నరసింహారెడ్డి ప్రతీకాత్మక దృశ్య హృదయ సంవేదనను సోదాహరణంగా 62 కవితల ప్రతీకలను వినూత్న ఇతివృత్తంగా ఆవిష్కరించారు. **'కరీంనగర్ కథా సాహిత్యం- బహుజన తత్వం'** వ్యాసం లో ఆ జిల్లాలోని విస్తృత బహుజన మేధావులు కథా ప్రక్రియ రూపంగా వెలువరించిన విభిన్న దృక్కోణాల భావజాల జనజీవన నేపథ్య పరిణామాలను 11 అంశాలుగా, సమగ్రంగా అద్భుత రీతిలో దర్శింపచేసారు. **'కులవృత్తుల సామెతలు- జీవన శైలి'** వ్యాసంలో డా॥ త్రివేణి, తెలుగుకు సొంతమైన వ్యవహార రూపంలోని జననానుడిలో చెలామని అవుతున్న సామెతలను కులవృత్తులలొ నిక్షిప్తమైన సంభాషణలలోని ప్రావీణ్యత, ప్రయోజనం దృష్ట్యా పరిశోధనా దృష్టితో పరిశీలించి అద్దం పట్టారు. త్రివేణి-9 సంక్షిప్త పద నామంతో రచయిత్రి ప్రచురింప చేసిన ఈ వ్యాస సంపుటిలో నవ మాసాల మాతృవేదన ప్రతీకగా **'మూడు కథలు- రెండు పురిటి నొప్పులు, ఒక మాతృవేదన'** పెద్దింటి అశోక్కుమార్ కథలపై పురిటి నొప్పుల కథల అపురూప సృజనపై డా॥ త్రివేణి పత్ర ప్రచురణ ఎంతైనా అభినందనీయం.

డా॥ వి. త్రివేణి, వెలువరించిన **'బటువు'** సాహిత్య వ్యాసాలు తెలుగు సాహితీ సరస్వతికి మణి భూషణాలు. తెలుగు సాహిత్యంలో పరిచయం, సమీక్ష, విమర్శ, విశ్లేషణ, వివరణ, ముందుమాట వంటి సంక్షిప్త రచనలకు అంతగా గుర్తింపు లేకపోవటానికి కారణం, ఏ ప్రక్రియ అయినా ప్రతిభావంతంగా లోలోతుల్లోకి వెళ్ళి దర్శించి విశ్లేషించి రాయగల ఉత్తమ సాహితీవేత్తలు అరుదుగా వుండటమే. ఇలాంటి **'బటువు'**లు ఇంకెన్నో తెలంగాణ సాహితీ వధూటి వేలుకు అలంకరించగల డా॥ వి.త్రివేణి అభినందనీయురాలు.



-జయసూర్య
సెల్: 9440664610




**ప్రతులకు:**
ఆచార్య వంగరి త్రివేణి
తెలుగు శాఖ, హైదరాబాద్
సెంట్రల్ యూనివర్సిటీ,
సెల్: 99514 44803

# దీపావళి పర్వదిన విశిష్టత

భారతదేశం వసుదైక కుటుంబం పురాణకాలం నుండి ఆచార సంప్రాదాయలకు పుట్టినిల్లు. అటువంటి ఆచారాలలో మనం పాటించే వాటిలో పండుగలు ముఖ్యమైనవి. అలాంటి పండుగలలో దీపావళి ఒకటి .జగతిని జాగృత పరచే చైతన్యదీప్తుల శోభావళి దీపావళి.

ఈ దీపావళి పండుగ ఆశ్వీయుజ మాసం చతుర్దశి నాడు నరక చతుర్దశిగా మరుసటి దినం అమవాస్యనాడు దీపావళిగా జరుపుకుంటారు. ద్వాపరయుగం నుండి ఈ పండుగ జరుగుతుంది.

పండుగ పూర్వకథని గమనిస్తే కృతయుగంలో హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు వర గర్వంతో సాధుజనులను పీడించేవాడు. తన అహంకారంతో భూదేవిని ఎత్తుకెళ్ళి పాతాళంలో దాచాడు. ఆగ్రహించిన విష్ణుమూర్తి దశవాతారాలలోని మూడవ అవతారం అయిన వరాహ స్వామి అవతారంలో వెళ్ళి పాతాళంలో హిరణ్యాక్షుడుతో యుద్ధం చేసి భూదేవిని రక్షించాడు. అప్పుడు వరాహస్వామి భూమాత మోహానికి గుర్తుగా వారికి జన్మించినవాడు నరకాసురుడు.

వరాహస్వామి భూమాత నిషిద్ధసమయంలో కలవడం వలన అసురసంధ్యా సమయంలో జన్మించడంతో నరకాసురుడికి పుట్టుకతో రాక్షస లక్షణాలతో జన్మించాడు. ఇది తెలిసిన భూమాత అతన్ని విష్ణుమూర్తి సంహరిస్తాడని తన బిడ్డ చావు తన చేతిలోనే ఉండాలని వరం విష్ణుమూర్తి వద్ద వరం తీసుకుంటుంది. తర్వాత నరకాసురుడిని జనకుడు అనే రాజుకి అప్పజెప్పి విద్యాబుద్దులు నేర్పించమంటుంది భూమాత. జనకుడు నరకాసురుడికి మంచి విద్యాబుద్దులు నేర్పించి రాజును చేస్తాడు.

నరకుడు కామాఖ్యను రాజధానిగా చేసుకొని ప్రాగ్జ్యోతిష్యపురము (ప్రస్తుతం అది అస్సాంలోని గౌహతి ప్రాంతం.) అనే రాజ్యాన్ని పరిపాలిస్తుంటాడు. కామాఖ్యలోని అమ్మవారిని తల్లిలాగ భావిస్తు చక్కగా పూజచేసేవాడు. తన రాజ్యములోని ప్రజలందరిని ఎంతో చక్కగ పరిపాలించేవాడు. ఈ విధముగా కొన్ని యుగాలు గడిసిపోయాయి. తర్వాత ద్వాపరయుగములో, అతనికి పక్క రాజ్యమైన శోణితపురముకు రాజైన 'బాణాసురునితో 'స్నేహము ఏర్పడుతుంది. బాణాసురుడు స్త్రీలోలుడు. వారిపై బలాత్కారం చేసేవాడు. అతని దృష్టిలో స్త్రీ ఒక భోగవస్తువు. అతనితో నరకాసురుడు స్నేహం చేశాడు. అతని ప్రభావము చేత నరకాసురుడు మెల్లగా అమ్మవారి పూజ ఆపివేశాడు. ఇంకా అతనిలో పుట్టుకతో వచ్చిన రాక్షస లక్షణాలు బయటకి వచ్చాయి. నరకాసురుడు కామ పిశాచి అయ్యి ప్రపంచము లోని ఇతర రాజ్యాల మీద దండయాత్ర చేసి ఆయా రాజ్యాల లోని రాజకుమార్తెలందరిని బలవంతముగా ఎత్తుకొచ్చి తన రాజ్యములో బంధించి వివాహమా డదలిచాడు. ఆ విధముగా 16,0000 మంది రాకుమార్తెలను బంధించాడు. వరాహస్వామి దేవేరి-భూదేవికి కలిగిన సంతానమే 'నరకాసురుడు'. దేవపుత్రుడే అయినా.. పుట్టిన వేళా విశేష ఫలితంగా నరకాసురుడిలో రాక్షసత్వం నిండిపోతుంది. తరువాతి కాలంలో నరకాసురుడు 'కామ రూపాధిపతి'గా మారతాడు. తనను తాను అత్యంత బలవంతుడిగా భావించుకుంటాడు. వరగర్వంతో సకల లోవాసులను... దేవతలనూ విడిచి పెట్టకుండా అందరినీ హింసించడం ప్రారంబిస్తాడు. .దీంతో నరకాసురుడి ఆగడాలనుంచి రక్షించమని బాధితులు దైవాన్ని స్మరిస్తారు. చివరి? నరకాసురుడు స్వర్గంపై దండయాత్ర చేస్తాడు. స్వర్గాధిపతి ఇంద్రుడిని తరిమివేసి స్వర్గాన్ని ఆక్రమిస్తాడు. ఈ విధంగా నరాకాసురుడు కృతయుగం నుండి ద్వాపర యూగం వరకు అందరినీ హింసించసాగాడు.

ద్వాపర యుగంలో విష్ణుమూర్తి శ్రీకృష్ణుడుగా భూదేవి సత్యభామగా జన్మించారు. నరకాసురుడు యొక్క దుశ్చర్యలు మితిమీరి పోవడంతో శ్రీకృష్ణుడు సత్యభామ.సమేతుడై నరకుడిపైకి యుద్ధానికి వెళ్ళాడు. వారి మధ్య యుద్ధం భయంకరంగా సాగింది.

నరకాసురుడి బాణం తగిలి శ్రీకృష్ణుడు మూర్ఛపోతాడు. అప్పుడు సత్యభామ నరకాసురుడితో ఘోర యుద్ధం సాగిస్తుంది. ఇలా ఈ భీకర యుద్ధంలో సత్యభామ చేతిలో నరకాసురుడు మరణించాడు. అప్పుడు సత్యభామకి కృతయుగంలో వరాహస్వామి తనకి జన్మించినవాడు నరకాసురుడు. అని తన బిడ్డను తానే చంపానని దుఃఖించి నా కుమారుడిని ఈ లోకం గుర్తుంచుకునేటట్లు చేయమని శ్రీకృష్ణుడిని కోరండంతో నరకాసురుడు ఆశ్వయుజ బహుళచతుర్దశి నాడు అంతమవ్వడంతో ప్రతియేడు ఆశ్వయుజమాసంలో వచ్చే చతుర్దశిని నరకచతుర్దశిగా జరుపుకుంటారని ఆయన సత్యభామకి వరమిచ్చాడు.

## నేలకు దిగిన తారావళి ..!

మురారి తన సరసనుండగా
వీరనారీమణి సత్య భామ
వింటినారిని సరిగా సంధించి
నరకాసురుడిని వధియించి
ధరణికి ఆమె కాసింది కావలి..!.

అమావాస్య అవనిలో
జిలుగు వెలుగుల రంగేళి
తిమిరాలను పారద్రోలిన
దివ్య నవ్య దీపావళి..!

ప్రమదలు హర్షమోదాలతో
ప్రమిదలలో తిలల చమురు పోసి
చిరునవ్వులతో చిరుదీపాలను
వెలిగించిరి కిలకిలమంటూ..!

చిన్నారి వెలిగించె సిసింద్రీ
వయ్యారి దీపించె మతాబు
బుడ్డోడు వెలిగించె చిచ్చు బుడ్డి
పెద్దోడు ఎగుర వేసే బాణాసంచి
ఇంటింటా టపాసుల ప్రతిధ్వని..!

ఊరువాడంతా ఉరిమే దీపావళి
నింగి నుంచి నేలకు దిగిన సితారావళి
ప్రజల సంతోషాల రూపావళి
మూలన ముసురుకొన్న తిమిరాలు
జడుసుకొని దాటే ఊరి పొలిమేరలు..!?



-జి.సూర్యనారాయణ
6281725659.

నాటి నుండి తమ కష్టాలు తొలిగి పోయాయని సంతోషించి ప్రజలు అమవాస్య ముందురోజు నరకచతుర్దశిగా మరునాడు అమవాస్య రోజు దీపావళిగా దీపాలను వెలిగించి సంబరాలను జరుపుకుంటారు. అప్పటి నుంచి 'దీపావళి' పండుగ జరుపుకోవడం మన ఆచారమైనట్లు మన పురాణాలకథనం. ఈ విధంగా చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకుంటారు.

***పండుగ నీతి:*** పిల్లలు పెడద్రోవ పట్టినప్పుడు తల్లిదండ్రులు వారిని శిక్షించి మంచి తెలపవచ్చని,అలాగే చెడ్డవారితో స్నేహం చేయరాదని,దుష్టులకు అంతం తప్పదని తెలుపుతుంది.



-డి.అమీర్
9642480702

## ఇదే నేటి దీపావళి!

కాదంబరీ కావ్యంలోని మహావాక్యాలలా, అర్జునుని బాణాల
చాపల్లేని భారీ వర్షాలకు ప్రమిదలన్నీ తడిసిపోయి, మట్టి ముద్దలై
రాజకీయ విమర్శల వరదల్లో కొట్టుకుపోగా ఇక దీపావళి ఎక్కడిది?
కాంతికి ఇంధనమైన తైలం, అపరాధ రక్షణ వ్యవస్థలో
కామనరకాసుల అత్యాచార, హత్యాచారాల ఉష్ణోగ్రతలకు
ఆవిరియైపోగా, ఇకవత్తి ఎలా కాలుతుంది?
దీపస్తంభాల వంటి వత్తులు, మళ్ళీ జన్మించిన దుశ్శాసన, రావణ,
కీచకుల లోహపాదాలక్రింద నుజ్జుఇపోతూ ఉంటే
ఇక దీపాలు వెలుగుతాయా?
ఇంటికి దీపాలైన ఇల్లాంద్రనుండి, కుటుంబపు దిక్కుల వంటి
అత్తల వరకూ
విచక్షణారహిత అత్యాచారకాండలలో, జీవిత వృక్షాలు కూలిపోతూ ఉంటే
పసిమొగ్గల నుండి పండు పత్రాల వరకు
రేపిజం అనలఅనిలాలకు నుసిపోయి రాలిపోతూంటే
ఇక దీపశ్రేణులకు అస్కారమేదీ
అక్షరార్థినుల, అనాధ అబలల శరీరాలు రేపిష్టుల, మర్దరిస్టుల
హస్తాలలో శిథిలగృహాలౌతుంటే
ఆకాశం విలపిస్తుంటే
భూమిపై నక్షత్రాల వంటి దీపమాలికలు ఎలా వెలుస్తాయి!
పైశాచిక ద్వేషపూరిత రాజకీయ హస్తాలలో "దిశచట్టపు" దస్త్రాలు
చిరిగి చెల్లాచెరవుతుంటే, ఇక రమనీమణులకు రక్షణ ఏది?
నేటి సామాజిక సాహిత్యం అభంగాల మానభంగాల "వళి"తో
మొదలవుతుంటే ఇక మహిళా సాధికారతకు "దివ్వెల పండుగ" ఏది?
దివిటీలన్నీ కామోన్మత్త కాలకేయులపై ఒలింపిక్ విజేతల
చేతుల్లోని ఈటెల్లా దూసుకుపోవాలి!
ప్రతి పడతిలోను సత్యభామ ఆవేశించి, దిశచట్టం, తక్షణ శిక్షల
ధనుర్బాణాలతో మాననీ మాన ప్రాణ హరణ అరిష్టశక్తులను
అంతమొందించినవాడు, అదే "దీపావళి"!
మానవాళికి ప్రమోదాలవల్లి!



- వి.యస్.వి. ప్రసాద్
సెల్: 9618635227

## దీపావళి ఇదేగా!

చీకటి వెలుగుల చిటపటలు
దివ్వెల వరుసలు దశ దిశలు
దీపావళి పండుగంటే కేరింతలు
పిల్లల ముఖాల్లో మతాబులు
పెద్దల ఉత్సాహం చిచ్చుబుడ్లు
మధ్యతరగతి బతుకులు భూచక్రాలు
నిత్యావసరాల ధరలు తారాజువ్వలు
క్షణికానందం కాకరపువ్వొత్తులు
పగలూ ప్రతీకారాలు పాముబిళ్లలు
డబ్బున్నోడికి దుబారా పండుగ
పేదోడికిది గాబరా పండుగ!



-శర్మ సీహెచ్
సెల్ : 9440587567

# సూర్యకిరణాల్ని ఆ నల్లబాలుడు కిరీటంగా ధరించాడు



-డా॥ కత్తి పద్మారావు
9849741695

ఆ కొండల అంచుల్లో
వేలాడుతున్న లాంతరులా
సూర్యబింబం
ఆ చరియల్లో
జలకమాడుతున్న కిరణాలు
బంగారు తరగల్లా మెరుస్తున్నాయి
గుంపులు గుంపులుగా వెళ్తున్న
ఆ మెయిలుల జాతరలో
ఆ పక్షులు నీటి తుంపరలతో
దాహార్తి తీర్చుకుంటున్నాయి
ఆ నక్షత్రాలను అలంకరించుకున్న
ఎవరో జవ్వని
ఆ వెన్నెల బాటలో పాదముద్రలు
ఆ యక్షుని కన్నుల్లో
చిత్రాలవుతున్నాయి
ఆమె కొప్పు నుండి జారిపడిన
ఆ జాజి పువ్వు
నేలకు పరిమళం తెస్తుంది
ఓ చిరునవ్వుతో
తమలపాకులు కోస్తున్న
యువతి చేయి అప్పుడే
వర్ణాంతరం చెందింది
ముళ్ళ పొదల్లో దాగిన
మొగిలిరేకులను అందుకున్న
ఆ బాల సృజన రహస్యాన్ని తెలుసుకుంది
ఆ సింధు లిపిని
పరిశోధించిన శాస్త్రవేత్త
అక్షరాలు మెదడులో రూపొందాకే
శాసనాలయ్యాయని తెలియజేస్తాడు
గణాల మహాయానంలో పుట్టిన మార్పులే
చరిత్రను సృష్టించాయి
జన పదఘటన నుంచే
ఖండాలు, దేశాలు, ఆవిర్భవించాయి
సమూహం హద్దులు గీస్తూ చెరుపుతూ వెళ్తున్నారు
బాహిర్యుద్ధంలో అంతః స్పమరం మరిచారు
ప్రవక్తలు శాంతిని బోధించారు
దేశాధిపతులు యుద్ధాన్ని కోరుకుంటున్నారు
ఇప్పుడు సుందరమైన నగరాలు బుగ్గిపాలవుతున్నాయి
విధ్వంసం నియంత మెదడులో పుడుతుంది
నిన్న గాజా, ఈరోజు టెహ్రాన్
ఏదైతేనేం?!
పరస్పర విద్వేషమే
వినాశనానికి మూలం
పశ్చిమ ఆసియాలో ఎందరో
ప్రబోధకులు జన్మించారు
వారు ఎగురవేసిన
శాంతి పావురాలు
ప్రపంచమంతా వీక్షణం చేసి
ఇప్పుడు జెట్ - ఎఫ్ విమానాలు
విధ్వంస విన్యాసాలు చేస్తున్నాయి
నగరాల నుండి ప్రజలు
పరుగులు తీస్తున్నారు
నిజమే !
ఆ నియంత ఆనాడు మానసిక క్షోభను అనుభవించాడు
నియంతలది ఆత్మహననమేగా!
ఆ 'వార్డ్స్ వర్త్ '
తన ఊరిలోనే ఉండి
ఆ తుమ్మెదపై గీసిన వర్ణ చిత్రం
ప్రపంచాన్ని వెలిగించింది
సుకవి సృష్టికర్త.
నియంత విధ్వంసకుడు
ఆ సెలయేటిలో ఈదుతున్న కొరమేను
పులి, చప్పుడు లేకుండా వచ్చి
నీళ్లు తాగుతున్నప్పుడు
కదలికను ఆపింది
ఆ తర్వాత జింక వచ్చి ఒళ్ళు తడుపుకోవటం చూసింది
ఆ వడ్రంగి పిట్ట నాలుగు నీటి
బిందువులను నిశ్శబ్దంగా స్పృశించటం కూడా చూసింది
మళ్లీ ఈత ప్రారంభించింది. వేటగాడు రాలేదని మాత్రం
ఊపిరి పీల్చుకుంది!
జలచరాలు లేనిదే తటాకానికి అందమేముంది?!
అతను ఎవరో సనాతనంలో
అధునాతనాన్ని వెతుకుతున్నాడు!
ఎర్ర సముద్రంలో కమండలాలు
సృష్టించగల నయాబ్రాహ్మణవాదులు
ఇప్పుడు కండపుష్టి
భజనపరులకే ఉంది
వారి ప్రసాదాలన్నీ పౌష్టికాహారాలే!
ఆ దళిత వాడల్లో జీవించే బుడ్డోడు
నేతి చుక్కను ఎరుగడు
మహా నదులున్న చోట
మంచినీళ్లు దొరకని దేశం !
అనంత ధనాగారాలున్న చోట
బువ్వ దొరకని నేల!?
మందల మందల
పశువులు ఉన్నచోట
చంటోడికి పాల చుక్క
దొరకని మట్టిదిబ్బ.!?
ఆ పాలకుని విశ్వవిద్యాలయం
కుల దోపిడీ పాఠాలు నేర్పుతుంది!
పేదోళ్ల శిశువులు
మృత్యు గృహానికి!?
పెద్దోళ్లకు బహుసంతాన ప్రాప్తిని బోధిస్తున్నారు!
భజంత్రీలు ఒకసారి పొగిడి,
మరొకసారి తిట్టి
వైర భక్తిని ప్రకటిస్తున్నారు!?
ప్రజలు అనృతాన్ని
పదేపదే వింటున్నారు
సత్యం తేనె తుట్టె అలాగే
పిడసగట్టిపోతుంది
ఔను! వారు వర్ణాంతరులే!
ఆ బోధకుడే వారి తెరలు తెంచాడు.
ఆ మంచు కొండల్లో మంటేసి నృత్యం చేస్తూ
అమరగానాన్ని వినిపిస్తున్న ఆ తెగలు
వర్ణాంతర సందేశాన్ని ఇస్తున్నాయి
ఆ బోధకుడు ప్రపంచంలో నిర్మించబడిన ఇనుప గోడల్ని
ఒక్క మృదు వాక్యంతో కూల్చాడు
ఆ సుత ఆ కులాంతరుణ్ణి వరించింది
ఆ తండ్రి తన మెదడుల్లో
జిల్లేళ్ళు ను పెంచాడు
ఆమె అగడ్తలు దాటింది
రూపాయి నుండి డాలర్ల కోసం దేశాన్ని దాటిస్తున్నారు!
"వివాహానికి కులం ఎందుకు"? అంది
నిజానికి ఆ ఊరుని
తుఫాను తాకింది!
ఆ ఊరిలోనే పుట్టిన వాడు
ఇంటికి బంగారు తాపడమేశాడు
ఆ మునుగుతున్న ఊరుని అతను చూడలేదు
కానీ ఆ ఊరు తట్టుకుని నిలబడింది
అతడి భవనంలోకి మాత్రం కొండచిలువ ప్రవేశించింది
నదీ నాగరికతదే విజయం.
ఔను! ఆ బాబాసాహెబ్
"జాతులన్నీ సంకరమైనవే" అని
ఎందుకన్నాడో వారికిప్పుడు
అర్థమౌతుంది
మీ సాంప్రదాయాల గోడలన్నీ బద్దలవుతున్నాయి!
నూత్న సృష్టికి అతడు పురుడు పోశాడు.
మార్పును ఎవడు ఆపగలడు ?
చరిత్ర పరిణామ శీలమైంది
కొండ అంచుల్లో నిలబడిన
ఆ నల్ల బాలుడు సూర్యకిరణాల్ని కిరీటంగా ధరించాడు
ఈ వర్ణాంతర ప్రపంచానికి అతడే చక్రవర్తి.
అతని రాజ్యంలో వెలుగొందుదాం!




నలుగులు
జిలుగులు
దీపావళికి ఇంటింటా కానవస్తాయి ఆనందపు వెలుగులు
-ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

ఆరావళి
తారావళి
మనసుకు ఆనందం కలిగిననాడే అసలైన దీపావళి
-ఉదండ్రావు రమణబాబు
నరసన్నపేట

ఎడమోము
పెడమోము
పారిజాతవృక్షము చూసి వెలిగెను సత్యభామ నగుమోము.
-సూర్యకళ తనికెళ్ల
విశాఖపట్నం.

ఇష్టం
నష్టం
టపాసులు కాల్చడం తేలిక కొనడమే కష్టం
-సోమ సురేష్
గంగావతి

కోపం
శాపం
శాంతంగా జీవిస్తే అదే పెట్టని దీపం
-శేష శైలజ(శైలి)
విశాఖపట్నం

వళావళి
తారావళి
కష్టాలు కనుమరుగయి .. వెలుగులు విరజిమ్మే దీపావళి
(వళావళి =వేడుక )
-జి .ఎస్.వి.సత్యనారాయణ
హైదరాబాద్

నారీమణి
తారామణి
నరకాసురునితో ధీటుగా యుద్ధం చేసిన 'భామా'మణి
-ఇలపావులూరి రాజ్యలక్ష్మి
హైదరాబాద్

సుగతము
మరకతము
సత్రాజిత్తు పుత్రిక సత్యాకృష్ణచే నరకాసురుడు విగతము.
-వి యస్ శాస్త్రి ఆకెళ్ల
విజయనగరం.

తారాజువ్వలు
నిప్పురవ్వలు
ఆబాలగోపాలం, అలరింపజేసి ఆనందతాండవం చేయిస్తాయి కాకరపువ్వులు
-పద్మ యాచవరపు
హైదరాబాద్

మేచకము
రోచకము
దీపావళి - చెడుపై గెలుపు హితకరమని సూచకము
-వి నాగమణి
హైదరాబాద్

కారణం
మారణం
సత్యభామచే నరకాసురుని మరణం శ్రీకృష్ణుని ప్రేరణం!
-జి .వి .సూర్యనారాయణ
హైదరాబాద్.

దీపావళి
శబ్దావళి
వెలుగులు రువ్వుతూ కుటుంబాల్లో తగ్గించు శోకావళి
-శాంతమూర్తి, హైదరాబాద్

జనావళి
దీపావళి
చిన్నా పెద్దలకీ పండుగ అద్భుత ఆనందకేళి.
-కె.శ్రీహరి .హైదరాబాద్.

నిశి
మసి
ఉజ్వలమైన దీపాల కాంతిలో మాయమైనాడు శశి .
-యడవల్లి విజయలక్ష్మి
రాజమండ్రి

నేత్రము
గాత్రము×
టపాసులు కాల్చునపుడు భద్రతయే నీ సూత్రము
(గాత్రము=శరీరము)
-కాళీపట్నపు శారద
హైదరాబాదు

తొలగించాలి
కలిగించాలి
బడుగుజీవుల చీకటి బతుకుల్లో ఆశాదీపాలు వెలిగించాలి
-టేకుమళ్ళ ఆనందరావు
సింగపూర్

తారావళి
శోభావళి
ఆబాలగోపాలాన్ని అలరించే వెలుగుల పండుగ దీపావళి
-కాయల నాగేంద్ర
హైదరాబాద్

నవ్వులు
పువ్వులు
దీపావళి కాంతులు, టపాసులు పేలితే -కెవ్వులు!
-గోపరాజు వెంకట సూర్యనారాయణ
హైదరాబాద్.

జువ్వలు
రవ్వలు
దీపావళినాడు ఇళ్ళలో మ్రోగుతాయి లక్ష్మీదేవి మువ్వలు
-ఉపద్రష్ట సుబ్బలక్ష్మి
హైదరాబాద్

పండుగ
మెండుగ
దీపావళిలో మతాబులు ఖర్చు పూర్తిగా దండుగ?
-ఆర్. రమాదేవి
హైదరాబాద్

రాసం
హాసం
మనసంస్కృతిపై ఉండాలి గౌరవసంత్రాసం-ప్రదర్శించరాదు అట్టహాసం.
-డా.రామడుగు వేంకటేశ్వర శర్మ.
హైదరాబాదు.

న్యాయం
శ్రేయం
ధర్మాత్ములుగా జీవించటమే కావాలి అందరి ధ్యేయం
-సూర్యదేవర రవికుమార్
గుంటూరు.

ఈడు
జోడు
నరకాసురుని సంహారంలో శ్రీకృష్ణునికి సత్యభామ తోడు.....!!
-శ్రీమతి భారతీకృష్ణ
హైదరాబాద్

దీపిక
ఓపిక
నైరాశ్యపు బతుకులకు ఆశల వెలుగుబాట చూపిక
-బి.పి.మైత్రిలత
బెంగళూరు

చామా!
భామా!
ప్రతిచోటా నరకాసురులే! కావాలి ప్రతిలేమా సత్యభామ!
-సిహెచ్.వి. బృందావన రావు
నెల్లూరు

పండుగా
మెండుగా
కాలుష్యాన్ని పెంచే పనులు ఎందుకు దండుగా?
-భాగ్యశ్రీ ముత్యం
కొవ్వూరు.

వెల్లదనం
ప్రల్లదనం
నవ్వితే అందం - నవ్విస్తే ఆనందంతో చల్లదనం
-విత్తనాల విజయకుమార్
హైదరాబాద్

శిల్పకారులు
చిత్రకారులు
ఎవరి పనిలోవారు అంకితం అవుతారు దీపధారులు
-కుసుమ. పత్రి
తణుకు

కొవ్వొత్తులు
పువ్వొత్తులు
దీపావళి వేడుకలో పిల్లలకు ఇష్టం కాకరపువ్వొత్తులు
-జె.విజయకుమారి
విశాఖపట్నం

ఆవళి
జనావళి
అమవస నిశిలో వెలుగుల దిబ్బుదిబ్బు దీపావళి
-అచ్యుతుని రాజ్యశ్రీ
హైదరాబాద్

దీపావళి
తారావళి
వెలుగు జిలుగులలో పఠిస్తారు భగవంతుని నామావళి
-కాటేగారు పాండురంగ విఠల్
హైదరాబాద్

విజ్ఞత
సరసజ్ఞత
హృదిని జ్యోతిలా వెలిగించు -నీదే సంప్రజ్ఞత
-వై.పద్మ
హైదరాబాద్

కనుము
వినుము
కీడును కోరక - వెలుగు మార్గాన చనుము.
-సింహాద్రి వాణి
విజయవాడ.

అదరకు,
చెదరకు,
వెలుగుబాట సాగేందుకు చీకట్ల ఒడిదుడుకులకు బెదరకు!
-దినవహి సత్యవతి
గుంటూరు.

జీవనం
సేవనం
సమాజహితంగా చీకట్లను ఛేదిస్తే బతుకు పావనం
-పురిమళ్ల సునంద, ఖమ్మం

# ఆణిముత్యాల్లాంటి అక్కినేని శతచిత్ర విశేషాలు

ప్రముఖ సినీ విశ్లేషకులు, సినీ విజ్ఞాన విశారద బిరుదాంకితులు ఎస్.వి. రామారావు, మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు నటించిన 255 సినిమాల నుండి వంద సినిమాలను ఎన్నుకుని విశ్లేషిస్తు వెలువరించిన అపురూప గ్రంథం **"అక్కినేని ఆణిముత్యాలు"** అక్కినేనికి వీరాభిమాని అయిన ఎన్.వి. రామారావు (ఎస్.వి) యిది వరలో **'అక్కినేని కథాయికలు', 'అక్కినేని సూక్తులు'** పేరిట రెండు గ్రంథాలు ప్రకటించడమే గాక అక్కినేని వారి మీద మూడు డాక్యుమెంటరీలు నిర్మించారు. తెలుగు సినిమా చరిత్రను గ్రంథస్తం చేస్తు పదిహేను గ్రంథాలు వెలువరించిన అనుభవజ్ఞులు.రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు అందుకున్న ప్రతిభావంతులు.

అక్కినేని హీరోగా 1944వ సం॥లో నటించిన తొలిచిత్రం '**శ్రీ సీతారామ జననం**" నుండి 2014 సం॥లో విడుదల అయిన చివరి చిత్రం **'మనం'** వరకు కొనసాగిన అక్కినేని డెబ్బయి సంవత్సరాల సినీ ప్రస్థానం నుండి ఆణిముత్యాల్లాంటి వంద చిత్రాలను ఎంపిక చేసుకుని ఆయా సినిమాల కథాంశాలను, సాంకేతిక నిపుణుల వివరాలను క్లుప్తీకరిస్తు కొన్ని ఆసక్తికర విషయాలపై వెలుగులను విరజిమ్మారు. తెరవెనుక జరిగిన విశేషాలను పాఠకులకు అందించే ప్రయత్నం చేశారు ఎస్.వి. ఈ బృహత్ ప్రయత్నంలో అక్కినేని నటించిన జానపద, పౌరాణిక, చారి త్రక, సాంఘిక చిత్రాల వైవిధ్యాన్ని వెలికితీస్తు అక్కినేని నటనా పరిణా మక్ర మాన్ని విశదీకరించారు. కొన్ని విశేషా లను పరిశీలిద్దాం.

1941 సం॥లో ధర్మపత్ని చిత్రం లో బాలనటుడుగా తెరపై మెరిసిన అక్కినేని 1941 సం॥లో శ్రీ రాము డిగా **'సీతారామ జననం'** చిత్రంలో నటించగా బాలా త్రిపుర సుందరి సీతగా నటించారు. ఈమె అక్కినేనికి తొలిచిత్ర కథానాయిక.

1950 సం॥లో విడుదల అయిన **'పల్లెటూరి పిల్ల'** ఎన్.టి.ఆర్ మరియు అక్కినేని నటించిన తొలి మల్టీస్టారర్ చిత్రం. ఈ చిత్రంలో ముందుగా ఈలపాట రఘురామయ్యను బుక్ చేసుకుని కొంత షూటింగ్ తర్వాత ఫైటింగ్ సన్నివేశాలలో తాను చేయలేనని అంటు రఘు రామయ్య తప్పుకున్నారు. అప్పుడా పాత్రకు అక్కినేనిని బుక్ చేశారు.

1950 సం॥లో వచ్చిన **'సంసారం'** చిత్రంలో నాగేశ్వరరావు హీరో కాగా రెండో కథానాయికగా సావిత్రిని బుక్‌చేశారు. ఆమె నటనతో సంతృప్తి పొందని దర్శకుడు యల్వీ ప్రసాద్ ఆమెను తొలిగించి పుష్పలతను నియమించారు.

1953 సం॥లో విడుదల అయిన అక్కినేని చిత్రం **'బ్రతుకు తెరువు'. 'అందమే ఆనందం.. ఆనందమే జీవిత మకరందం'** పాట రచయితగా జూనియర్ సముద్రాలకు యిది తొలిగీతం. అజరామరమయిన పాట యిది.

1953 సం॥లోనే విడుదల అయిన సంచలన చిత్రం **'దేవదాసు'.** శరత్‌చంద్ర చటర్జీ 1917లో రాసిన ఈనవలను హిందీ, బెంగాలీ, తమిళం, హిందీ, తెలుగు, మలయాళం.. యిలా పలు భాషల్లో ఒకటి కంటే ఎక్కువసార్లు చలనచిత్రాలుగా ప్రముఖ నిర్మాణ సంస్థలు నిర్మించినయి. పి.సి.బారువా, కుందన్లాల్ సైగల్, దిలీప్‌కుమార్, కృష్ణ, షారుక్ ఖాన్ వంటి ఉద్దండులు దేవదాసుగా నటించారు. కానీ అక్కినేని నాగేశ్వర రావు దేవదాసుగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అయిదు తరాల ప్రేక్షకులు యిప్పటికీ అక్కినేని నటించిన **'దేవదాసు'**ను ఆదరిస్తునే వున్నారు. విశేషం ఏమిటంటే కథానాయిక పార్వతి పాత్రకు మొదట్లో షావుకారు జానకిని అనుకున్నా సావిత్రికి ఆ పాత్ర దక్కింది. సావిత్రి నటించిన చిత్రాల్లో ఆణిముత్యం **'దేవదాసు'.** ఈ చిత్రం తమిళ వర్షన్ మధురైలోని చింతామణి దియేటర్లో దాదాపు సంవత్సరంపైగా ప్రదర్శించబడింది.

1953 సం॥లో విడుదల అయిన మరో అక్కినేని చిత్రం **'కన్నతల్లి'.** ఈ చిత్రానికి తాపీ ధర్మారావు. శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర, సుంకర, వాసిరెడ్డి యిలా ఆరుగురు రచయితలు రచనచేయడం ఓ ప్రత్యేకత. నటిగా రాజసులోచన, గాయనిగా పి. సుశీల ఈ చిత్రం ద్వారానే సినీ రంగానికి పరిచయం గావటం. మరో ప్రత్యేకత. ఈ చిత్ర కథనే చిన్న చిన్న మార్పులతో హిందీలో **'మదర్ ఇండియా',**


'తెలుగుతెర' గ్రంథానికి నంది పురస్కారం ప్రదానం చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు

తెలుగులో **'బంగారు తల్లి'**గా, తిరిగి మళ్ళీ **'శక్తి'** పేరిట పునర్నిర్మించారు.

నిజ జీవితంలో నాస్తికుడైన అక్కినేని 1954లో విడుదల అయిన **'విప్రనారాయణ'** చిత్రంలో శ్రీరంగని భక్తుడుగా అద్భుత నటనను ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు.

అక్కినేని నాగేశ్వరరావు చైర్మన్‌గా దుక్కిపాటి మధుసూదనరావు మేనేజింగ్ డైరెక్టరుగా 1952 సం॥లో ప్రారంభమయిన చిత్ర నిర్మాణ సంస్థ **"అన్నపూర్ణా పిక్చర్స్".** అక్కినేని అర్ధాంగి పేరు మరియు డి. మధుసూదనరావు తల్లిగారి పేరు అన్నపూర్ణ కావడం యాదృచ్ఛికం. ఈ సంస్థ నిర్మించిన తొలి చిత్రం 'దొంగరాముడు' 1955 సం॥లో విడుదలయింది. చిత్రనిర్మాణానికి మూడు సంవత్సరాలు పట్టడం ఆ రోజుల్లో వింతగా చెప్పుకున్నారు. ఈ చిత్రంలో అక్కినేని దొంగగా నటించారు. విజయవాడలో జరిగిన ఈ చిత్ర శత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన జేబులోని పర్సును ఎవరో దొంగ తస్కరించడం గమ్మత్తైన విషయం.

1955 సం॥లోనే విడుదల అయిన మరో అక్కినేని చిత్రం **'మిస్సమ్మ'.** మొదట్లో భానుమతిని కథానాయికగా నియమించి కొన్ని సన్నివేశాలు చిత్రీకరించిన తర్వాత కారణాంతరాల వల్ల భానుమతి విరమించుకోగా సావిత్రికి ఆ పాత్ర దక్కింది. ఆమె నటించాల్సిన పాత్రలో జమున నటించింది.

1955 సం॥లో విడుదల అయిన మరో రెండు చిత్రాలు **'రోజులు మారాయి' 'సంతానం'.** మొదటి చిత్రంలో వహీదా రెహమాన్ డాన్స్ చేసిన **'ఏరువాకా సాగారో'** అన్న నృత్య గీతం నూవర్ హిట్ కాగా.. **'సంతానం'** చిత్రంలో లతా మంగేష్కర్ గానం చేసిన 'నిదుర పోరా తమ్ముడా' అనే గీతం ఈ నాటికీ మార్మోగుతూనే వుంది.

1956 సం॥లో విడుదల అయిన అక్కినేని చిత్రం **'ఇల వేలుపు'.** యల్.వి. ప్రసాద్ శిష్యుడైన డి. యోగానంద్ ఈ చిత్ర దర్శకుడు. యోగానంద్ దర్శకత్వంలో విడుదల అయిన మరో అక్కినేని చిత్రం **'పెళ్ళి సందడి'.** కానీ యోగానంద్ ఎన్.టి.ఆర్. చిత్రాల దర్శకుడిగానే ప్రసిద్ధిపొందారు.

1957 సం॥లో విడుదల అయిన అద్భుత చిత్రం **'మాయాబజార్'.** ఈ కథ తాలూకు అంశాలు అటు మహాభారతంలోగాని, అష్టాదశ పురాణాల్లోగాని కనిపించక పోవచ్చు. పింగళి నగేంద్రరావు విలక్షణ కథాసృష్టి **'మాయాబజార్'.** మార్కస్ బారట్లే ఛాయాగ్రహణం. కె.వి.రెడ్డి దర్శకత్వం నభూతో నభవిష్యతి అన్న చందంగా రూపుదిద్దుకున్న చిత్రరాజము 'మాయబజార్'. ఈ కథను డజను సార్లు భారతీయ భాషల్లో సినిమాగా తీయబడింది. ఇన్ని పర్యాయాలు మరే కథా తెరకెక్కలేదు.

సదాశివ బ్రహ్మం రూపొందించిన అద్భుత కథను బి.ఎ. సుబ్బారావు దర్శకత్వంలో నిర్మించిన చిత్రం **'చెంచులక్ష్మి'.** ఈ చిత్రంలో **'చిలకా గోరింక- కులికే పకపక' 'చెట్టు లెక్క గలవా నరహరి'** అన్న యుగళ గీతాల్లోని నృత్య రీతులను, భంగిమలను




ప్రతులకు: ఎస్.వి. రామారావు
ఫ్లాట్ నెం.500
(డో.నెం.2-4-681/3) మరియు ఫ్లాట్ నెం. 302, శుభోదయ ఎవన్యూ, రోడ్ నెం. 10/ ఏ, న్యూ నాగోల్ కాలనీ, హైదరాబాద్-35
సెల్: 9849139030

అక్కినేని, అంజలి గారలే రూపొందించుకోవడం విశేషం.

1960 సం॥లో విడుదల అయిన చిత్రం **'మహాకవి కాళిదాసు'.** కాళిదాసుగా నటించిన అక్కినేని వారికి 1996 సం॥లో మధ్యప్రదేశ్ ప్రభుత్వంవారి ప్రతిష్ఠాత్మక 'కాళిదాసు కౌస్తుభ' పురస్కారం దక్కింది.

1960 సం॥లోనే విడుదల అయిన **'నమ్మినబంటు'** చిత్ర విజయోత్సవ సందర్భంగా నిర్మాతలు పేపర్‌లో మేటి నటీనటులకంటే అద్భుతంగా నటించిన ఎద్దులు **'రాముడు-భీముదు'** అని ప్రకటిం చారు. 'ఎద్దుల మాకంటే బాగా నటిం చాయని చెప్పారుగా.. విజయోత్సవ సభకు వాటినే తీసుకెళ్ళండి' అని చురక వేశారట అక్కినేని.

1961లో మహాకవి ఆత్రేయ దర్శకత్వంలో వెలువడిన చిత్రం **'వాగ్దానం'.** ఈ చిత్రం ద్వారానే **'నాకంటి పాపలో నిలిచిపోరా'** అనే పాట ద్వారా గీత రచయిత దాశరథి సినీ రంగానికి పరిచయమయ్యారు.

1961లోనే విడుదల అయిన అన్నపూర్ణావారి **'వెలుగు నీడలు'** చిత్రంలోని **'పాడవోయి భారతీయుడా"** మరియు **'కలకానిది.. విలువైనది'** పాటలు శ్రీశ్రీని గీతాల రచయితగా చిరంజీవిని చేశాయి.

అన్నపూర్ణావారి మరో చిత్రం **'ఇద్దరు మిత్రులు'.** అక్కినేని తొలిసారిగా ద్విపాత్రాభినయం చేయగా నర్తమణులు రాజసులోచన, ఇ.వి. సరోజలు కథా నాయికలుగా నటించారు.

శారద సినీరంగ ప్రవేశం కూడా ఈ చిత్రం ద్వారానే. సావిత్రి నటించని అన్నపూర్ణావారి చిత్రం ఇదేగావటం విశేషం.

1961 సం॥లో విడుదల అయిన **'బాటసారి'** చిత్ర సమీక్ష రాయడం ద్వారా ఎస్.వి. రామారావు తన ఫిల్మ్ జర్నలిస్టు జీవితానికి శ్రీకారం చుట్టారు.

1962 సం॥లో వచ్చిన చిత్రం **'మంచి మనసులు'.** ఈ చిత్రంలోని **'మావ..మావా..మావా'** పాటకు సంగీత రచన చేసిన కె.వి.మహదేవన్ తదనంతర కాలంలో సినీ పరిశ్రమ 'మావ'గా స్థిరపడ్డారు.

1962 సం॥లో విడుదల అయిన **'గుండమ్మ కథ'** గురించి ఎంత చెప్పినా తక్కువే. తెలుగుచిత్రం 'గుండమ్మ కథ' ఎన్.టి.ఆర్‌కు నూరవ చిత్రంకాగా,



తమిళవర్షన్ **'మణిదన్ మారవిల్లై'** అక్కినేనికి నూరవ చిత్రం.

అక్కినేని వారికి సినారె తొలిసారిగా రెండు యుగళగీతాలను రాసిన చిత్రం 1962లో విడుదలైన **'కులగోత్రాలు'.**

తెలుగు చలనచిత్ర చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోయే చిత్రం **'మూగ మనసులు'.** ఈచిత్రం సావిత్రి దర్శకత్వంలో తమిళంలో 'ప్రాప్తం' పేరిట. ఆదుర్తి దర్శకత్వంలో 'మిలన్' గా హిందీలోను నిర్మించబడింది.

కోడూరి కౌసల్యాదేవి వ్రాసిన **'చక్రభ్రమణం'** నవల ఆధారంగా నిర్మించబడ్డ చిత్రం అన్నపూర్ణావారి **'డాక్టర్ చక్రవర్తి'.** ఈ చిత్రం రాష్ట్ర ప్రభుత్వ బంగారునందిని, కేంద్ర ప్రభుత్వ యోగ్యతా ప్రతాన్ని కైవశం చేసుకున్నది. ఫలితంగా లభించిన 50 వేల రూపాయల పెట్టుబడితో అక్కినేని, ఆదుర్తి నిర్మాతలుగా **'సుడిగుండాలు', 'మరో ప్రపంచం'** అనే ప్రయోజనాత్మక చిత్రాలను నిర్మించారు.

ఎయిర్ హోస్టెస్‌గా పనిచేస్తున్న వసుంధర 'కాంచన'గా పేరు మార్చుకుని నటించిన తొలి తమిళ చిత్రం **'కాదలిక్క నేరమిల్లై'.** అంతుకు ముందే తెలుగులో బాలనటిగా నటించిన కాంచన తెలుగు వర్షన్ **'ప్రేమించిచూడు'**లో జగ్గయ్యకు జంటగా నటించారు. 1965 సం॥లో


ఎస్వీ రామారావును అభినందిస్తున్న అక్కినేని...

విడుదలైన అక్కినేని చిత్రం యిది.

1966 సం॥లో వచ్చిన **'ఆత్మ గౌరవం'** చిత్రం ద్వారా ప్రముఖ నృత్యగురువు సుమతీకౌశల్ నృత్య దర్శకురాలిగా పరిచయం అయ్యారు. యిదే సంవత్సరం విడుదల అయిన **'నవరాత్రి'** చిత్రంలో తొమ్మిది పాత్రలను అద్భుతంగా పోషించి మెప్పించారు అక్కినేని.

1967 సం॥లో విడుదల అయిన **'పూలరంగడు'** చిత్రానికి ముప్పాళ రంగనాయకమ్మ మాటలు రాశారు. హైద్రాబాదుకి చెందిన ప్రముఖ రంగస్థ నటుడు, దర్శకుడు భాను ప్రకాష్ ఈచిత్రం ద్వారానే పరిచయం కాబడ్డారు.

1968 సం॥లో విడుదల అయిన **'సుడిగుండాలు'** చిత్రం ద్వారా ప్రముఖ నాటక రచయిత ఎన్.ఆర్. నంది సినీ రచయితగా సినీరంగ ప్రవేశం చేశారు. మరో రచయిత మోదుకూరి జాన్సన్ మాటల రచయితగా పరిచయమైన చిత్రం **'మరో ప్రపంచం'** (1970)

సురేష్ పిక్చర్స్ అధినేత డి. రామానాయుడు నిర్మించిన **'ప్రేమ నగర్'** 1971లో విడుదలై అఖండ విజయాన్ని సాధించింది. ఆత్రేయ పాటలు, మాటలు చిత్రానికి హైలైట్‌గా నిలిచాయి. **"ప్రేమనగర్ నా చిత్ర జీవితంలో గోల్డ్‌మైన్. అది బ్యాంక్. ఎప్పుడు కావాలంటే అప్పుడు విడుదల చేస్తే నన్ను ఆదుకుంటుంది"** అని రామానాయుడు సగర్వంగా చెప్పుకున్న క్లాసిక్ **'ప్రేమనగర్'.**

1972సం॥లో విడుదల అయిన అన్నపూర్ణావారి 'విచిత్ర బంధం' చిత్రంలో కొన్ని పాటలను నాగేశ్వర రావుకు తొలిసారిగా కొత్త గాయకుడు రామకృష్ణ ఆలపించారు.

సారథీ స్టూడియోస్ యాజమాన్యంతో నాగేశ్వర్రావుకు గల మనస్పర్థల కారణంగా ఆయన సినిమాలకు సారథి స్టూడియో అందుబాటులో వుండేది కాదు. ఆ కారణంగా **"మహాకవి క్షేత్రయ్య"** మైసూర్‌లో పూర్తి చేయవలసి వచ్చింది.

ఈ పరిస్థితిని అధిగమించాలని నిర్ణయించుకుని నాగేశ్వరరావు 1975సం॥లో బంజారాహిల్స్‌లో స్థలాన్ని సేకరించి రికార్డు స్థాయిలో నాలుగు నెలల్లో అన్నపూర్ణా స్టూడియో నిర్మించారు. ఆనాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. 1976 సం॥లో అన్నపూర్ణ స్టూడియోలో చిత్ర నిర్మాణం జరిగిన తొలి చిత్రం 'సెక్రటరి'.

1977 సం॥లో ఎన్.టి.ఆర్ నిర్మించిన చారిత్రాత్మక చిత్రం 'చాణక్య-చంద్రగుప్త'. ఎన్‌టిఆర్‌కు చాణక్యుని పాత్ర అంటే ఎంతో ఇష్టం. నాగేశ్వర రావుని చంద్రగుప్తుని పాత్ర వేయమని కోరారు. కానీ శరీరాకృతిరీత్యా ఎన్‌టిఆర్ రాజసం బాగుంటుంది కనుక చంద్రగుప్త పాత్రలో ఆయనే నటించాలని నాగేశ్వరరావు పట్టుబట్టారు. ఆ విధంగా చంద్రగుప్తుని పాత్రలో ఎన్‌టిఆర్ , చాణక్యుని పాత్రలో నాగేశ్వరరావు నటించగా అలెగ్జాండర్ పాత్రలో శివాజి గణేషన్ నటించారు ఎన్‌టిఆర్ పెద్దల్లుడు డా॥ దగ్గుపాటి వెంకటేశ్వరరావు నిర్మాతగా వచ్చిన చిత్రంల **'సత్యం- శివం'.** ఎన్‌టిఆర్ మరియు ఎఎన్ఆర్ కలిసి నటించిన చివరి చిత్రం యిది. మొత్తంగా యిద్దరు కలిసి నటించిన చిత్రాలు పదిహేను.

హాస్య చిత్రాల దర్శకుడిగా పేరొం దిన రేలంగి నరసింహారావు దర్శకత్వం లో నాగేశ్వరరావు నటించిన ఏకైక చిత్రం 1990లో విడుదల అయిన **'దాగుడు మూతల దాంపత్యం'.**

అక్కినేని విగ్గు లేకుండా అత్యంత సహజంగా నటించిన చిత్రం 1991లో విడుదల అయిన **"సీతా రామయ్య గారి మనవరాలు".**

నటుడు బాలకృష్ణ శ్రీరాముడిగా నటించిన చిత్రం **'శ్రీరామరాజ్యం'.** ఈ చిత్రంలో అక్కినేని వాల్మీకిగా నటిం చారు. ఆయన సజీవులై వుండగా పూర్తయిన చివరి చిత్రం యిది. రచ యిత ముళ్ళపూడి వెంకటరమణ దర్శ కుడు బాపుగారల కాంబినేషన్‌లో రూపొంచిన చివరి చిత్రం కూడా యిదే.

క్యాన్సర్ వ్యాధితో బాధపడ్తు నాగేశ్వరరావు నటించిన చిత్రం **'మనం'.** కుమారుడు నాగార్జున మనవడు నాగచైతన్య కాంబినేషన్‌తో రూపొందించిన ఈ చిత్రం 23.5.2014న విడుదల అయింది. విడుదలకు ముందే అక్కినేని నాగేశ్వరరావు 22.01.2014న పరమ పదించారు.

దేశ సినీ చరిత్రలో పద్మ విభూషణ్ పురస్కారం మరియు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన ఏకైక నటుడు అక్కినేని వారే కావడం తెలుగు వారికి గర్వకారణం.

యిలా ఏరుతూపోతే మరిన్ని విశేషాలను కోకొల్లలుగా పాఠకులు ఆస్వాదించవచ్చు.

కిన్నెర పబ్లికేషన్స్ వారి 140వ ప్రచురణగా విడుదల అయిన **'అక్కినేని ఆణిముత్యాలు'** గ్రంథాన్ని రచయిత ఎస్.వి. 'సాంస్కృతిక బంధు' సారిపల్లి కొండలరావుకు అంకితం గావించారు.

అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఎస్.వి. రామారావు సినీ అభిమానులకు, మరీ ముఖ్యంగా అక్కినేని అభిమానులకు అందిస్తున్న అపురూప కానుక **"అక్కినేని ఆణిముత్యాలు (శత చిత్ర) విశేషాలు"** గ్రంథం..

-రమణ వెలమకన్ని
సెల్:9866015040



పుస్తక సమీక్షలు

# ఉపయుక్తమైన గ్రంథం అప్పారి సూర్యప్రకాశ్ "పరిశోధక వ్యాసావళి"

తెలుగు రచయితల సమాఖ్య నిజామా బాద్ అధ్యక్షులుగా అనేకమంది కవులకు సుపరిచితులైన సూర్యప్రకాశ్ గారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆధునిక సాహిత్య సలహా ఉపసంఘ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా, నిజామాబాద్ క్లాసిక్ సినిమ మరియు కల్చరల్ సొసైటీ సంస్థాపక అధ్యక్షులుగానే కాకుండా అనేక సంఘాలకు ఎన్నికై తమ బాధ్యతలను నిర్వహించడమే కాకుండా కవిగా,రచయితగా, విమర్శకులుగా, వ్యాసకర్తగా, తెలుగు అకాడమీ వారి ప్రభుత్వ పాలనా పారిభాషక పదకోశం అనే గ్రంథానికి సంపాదకులుగా, అనువాదకులుగా కూడా తెలుగు సాహిత్యంలో ఒక ప్రగాఢమైన ముద్ర వేసిన వారు అనడంలో అతిశయోక్తి లేదు.

ప్రస్తుతం వీరు రచించిన సాహిత్య, సామాజిక, సాంస్కృతిక పరిశోధక వ్యాసావళి అంటూ దాదాపు నలభై వ్యాసాల గ్రంథంలో... సిద్ధాంత రచనలో కలిగే సాధకబాధకాలతో మొదలై రేడియో నాటికలు, జీవిత చరిత్రలు, సాహితీ ప్రముఖుల పరిచయాలు, సాహితీ ఆధారలతో కూడిన అధ్యయనాలు, రచన ఎలా చేయాలి? ఎందుకు చేయాలి అనే సూచనలు, ఆర్ట్ గ్యాలరీల విశేషాలు, ఒకప్పటి ఉత్తరాల పరిచయాలు, కథలు, కవిత్వంలో కొత్తపుటలు అనే




ప్రతులకు: అప్పారి సూర్యప్రకాశ్
ఫోన్: 95509 93232

సరికొత్త అంశం తాలూకు వివరాలు వంటివి రచించి, అందించడం నిజంగా ఎంతో ఆనందకరం. అందరికీ సుపరిచితమైన భాష, శైలి, వస్తువు, అవసరమైన విషయాలను తెలియజేయాలనే వీరి ప్రయత్నం విశేషం.

సాధారణంగా వ్యాసం అనేది విమర్శలాగానే తూలనాత్మకమైన ప్రక్రియ. వ్యాసానికి మొదట్లో ప్రమేయం, సంగ్రహం, ఉపన్యాసం అనే పేర్లుండేవి. సామినేని ముద్దు నరసింహం నాయుడు తమ వ్యాసరచనని **'ప్రమేయం'** గా వ్యవహరించారు. ఒకవిధంగా సామినేని వారే తెలుగు వ్యాసానికి మార్గదర్శకుడని చెప్పాలి. విద్యాప్రమేయం, వైద్య ప్రమేయం, వివాహ ప్రమేయం అనే ఎనిమిది పేర్లతో వివిధ అంశాలపై "హితసూచని" దాదాపు 224 పుటలతో గ్రంథం రచించారు . తర్వాత జియ్యరు రాసిన **"స్త్రీ కళా కల్లోలిని"** అనే వ్యాససంపుటి కూడా కందుకూరి వారిని కూడా ప్రభావితం చేసిందని చెపుతారు. ఇలా అనేకమంది మానవల్లి రామకృష్ణ కవి, నడకుదుటి వీరరాజు, వేటూరి శివరామశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, బండారు తమ్మయ్య, గిడుగు, జయంతి రామయ్యపంతులు వంటి అనేకులు వ్యాసాలను తొలితరంలో రచించి వాటిని భద్రంగా దాచుకునే గ్రంథాలుగా రూపొందించారు. తర్వాత 19వ శతాబ్దంలో పానుగంటి వారి 'సాక్షి' వ్యాసాలు పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేసాయి.

చాలామంది వివరాలను తెలియజేసి వ్యాసాలని పేరు పెడుతుంటారు. ఆ వివరాలు, ఆ సంబంధిత వ్యక్తి తాలూకు విషయాలను వాస్తవాలను జతచేస్తూ రచించే తీరును తెలియజేసేవారు కొందరే. అందుకే తెలుగులో అనేక వ్యాస సంకలనాలు, సంపుటిలు వచ్చినా ఆ గ్రంథం కనిపిస్తే తప్ప గుర్తుకు రాని పరిస్థితుల్లోకి నెట్టబడ్డాయి. అలా కాకుండా సూర్యప్రకాశ్ గారు రచించిన కూలంకుష వ్యాసాల్లో ఎంతో విషయం వుంది. వివరణాత్మకమైన అంశాలున్నాయి.

ఆయా సందర్భాలను అనుసరించిన విశేషాలు మిక్కిలి వున్నాయి. కొలకలూరి ఇనాక్ గారు వ్యాసం పట్ల అన్న మాటల్ని తలుచుకుంటే **"శతాధిక మేధావుల హృదయతేజం బుద్ధిబలం గ్రహించి రచనా ప్రక్రియగా స్థిరరూపం పొందింది వ్యాసం. వ్యక్తిత్వానికి స్థానం ఏర్పడ్డ ఈ సారస్వత ప్రజాస్వామికంలో బుద్ధి వికాసం తప్పనిసరి పరిణామం. వ్యాసం ఉత్కృష్ట స్థాయిలో వెలువడటానికి ఈ దేశం అనుకూలంగా వున్న శుభవేదిక మన తెలుగు సాహిత్యం"** అన్న మాటలు వ్యాసకర్తల పాలిట వరంలా వినిపిస్తుంది.

ఆ విషయంలో రేడియో నాటిక-పరిధి పరిమితి అనే వ్యాసం ఎంతో ఉపయుక్తంగా ఇనిపిస్తుంది. భవిష్యత్‌లో ఎవరు రేడియోకి నాటిక రాయాలన్నా ఒక అవగాహనతో రచిస్తారనే ముందుచూపుతో వీరి రచన పనికివస్తుంది. అలాగే సూర్యప్రకాశ్ రచించిన మరో వ్యాసం **"రోజూ రచన చేయండి"** అంటారు. చెకోవ్ అన్నట్లు ప్రతి రోజూ రాయండి. అది రచనా? డైరీనా? ఏదయినా పర్వాలేదు. రచన చేసే ముందు ఎలాంటి అవాంతరాలు వస్తాయి? ఎలా రాస్తే రచన పూర్తవుతుంది? కొందరికి రాయాలనుకుంటారే కానీ రాయలేరు. కానీ రచన చేయాలంటే కొంత సోషల్ లైఫ్‌ను త్యాగం చేసయినా రచనలు చేయండి అంటారు. కథ అయితే ఎలా రాయాలి? నవల అయితే ఎలా రాయాలి? అనేది తెలియజేసారు.

ఈ వ్యాసానికి కొనసాగింపుగానే మరొక వ్యాసం "రచన నిత్య నిరంతర ప్రక్రియ" మరింత రచనల గురించి, వాటిని రచించే విధానాన్ని గురించి తెలియజేసారు. ఈ వ్యాసాలు కొత్తగా రచనలు చేయాలనుకునేవారికి, ఆలోచనలున్నా రాయలేనివారికి ఎంతో ఉపయోగపడతాయి.

అలాగే శ్రీ గౌతమి కళాసమితి నిజామాబాద్ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని రంగస్థలానికి ఎనలేని సేవలు చేసిన చాట్ల శ్రీరాములు గారి గురించి **"అభినయ భరతాచార్య"** అంటూ సంబోధిస్తూ రచించడం ఎంతో బావుంది. వారు నటనాపరంగా, దర్శకత్వ పరంగా నాటకానికి ప్రాణం పెట్టి, ఒక తపస్సులాగా భావించి చేసిన తీరును చక్కగా వర్ణించారు.

తర్వాత మరొక ఉపయోగకరమైన విషయం **"మీ బ్లాగెలా ఉండాలి?"** అనే విషయంపై చక్కని విశ్లేషాత్మకమైన వ్యాసం రచించారు. బ్లాగు మధురమైన సంగీతంలా ఉండాలంటారు. అయ్యో! అపుడే అయిపోయిందా? అన్నట్లున్న డా॥సి.నారాయణరెడ్డి గారి ఉపన్యాసంలా ఉండాలి అనే ప్రయోగం కొత్తగా అనిపించింది. దీన్ని బట్టి వీరికి నారాయణ రెడ్డిగారి పట్ల వున్న మమకారం, వారి ఉపన్యాసం పట్ల ఉన్న ఉత్సుకత ఎంత వుందో తెలియజేస్తుంది.

వీరి వ్యాసావళిలో ఎన్నో ఉన్నతమైన వ్యాసాలున్నాయి. ముఖ్యంగా వడ్డెర చండీదాస్ అనే పేరు వినని వారుండరు. వారి జీవితాన్ని గురించి. రచనల గురించిన విశేషాలు ఎంతో వివరంగా తెలిపారు.

వీరితో పాటు అనేకులు చలం, రామన్ మేగ్సేసే, ప్రకాశం, శ్రీ.కె. వీరభద్రాచారి, డా॥కేశవరెడ్డి, మార్క్‌ట్వెయిన్ వంటి లబ్ధప్రతిష్ఠులపై విశ్లేషాత్మకమైన వివరాలు తెలియజేయడం హర్షణీయం. ఎందుకంటే వీరి గురించి చాలా మందికి తెలియదు. అలాగే సామాజిక వ్యాసాలు నేటి భారతీయ రచయిత పోరాటం, జీవితం లేని జీవన చరిత్రలు, సామాన్యుని సందేశం, కవిత్వంలో కొత్తపుటల, ఇందూరి భారతి సంక్షిప్త చరిత్ర, గుర్తుకొస్తున్న క్షణాలు, యుగాలు కవికి క్షణాలు వంటి అనేక వ్యాసాలు రచించారు. సాహితీ పరంగా, సామాజిక పరంగా, వ్యక్తి పరంగా, మనో విశ్లేషణ పరంగా రచించిన వీరి వ్యాసాలన్నీ ఆణిముత్యాలు. ప్రతి ఒక్కరూ చదవదగిన గ్రంథం. ఎన్నో ఏళ్ళగా రచనలు చేయడం కాదు. సాహిత్యాన్ని పెంపొందించుకునే తీరులో అప్పారి సూర్యప్రకాశ్ గారు వ్యాసాలు రచించడం ఎంతో ఆదర్శవంతం. వీరికి నా అభినందనలు. నమస్సులు..



-శైలజామిత్ర
9290900879

